# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త






## వైభవంగా కళ్యాణ వెంకన్న రథోత్సవం

### పోటెత్తిన భక్త జన సందోహం





చంద్రగిరి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:
కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. తదుపరి ఉదయం 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులను మండపానికి తీసుకువచ్చారు. సర్వాలంకారశోభితుడైన శ్రీనివాసుడు 8వ రోజు ఉదయం 7.30 గంటల నుండి 8.30 గంటల వరకు ఉభయదేవేరులతో రధాన్ని అధిష్టించి తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కంకణ భట్టార్ బాలాజీ రంగాచార్యులు వాహన విశిష్టతను వివరిస్తూ రథోత్సవం శరీరం, రథం, ఆత్మ–రధికుడు, బుద్ధి–సారధి, మనస్సు–పగ్గాలు. ఇంద్రియాలు–గుర్రాలు, –ఇద్రియ విషయాలు రథం నడిచే త్రోవలు. రథం రధికుణ్ణి చూడమంటుంది. రధికుడు పగ్గాల సాయంతో గుర్రాలను అదిలిస్తూ దారుల వెంబడి పరుగులు తీయించినట్లే ఇంద్రియాలతో, మనస్సుతో కూడిన ఆత్మవిషయాల్ని అనుభవిస్తూ వుంటుంది. రథోత్సవం ఒక ఉత్సవం మాత్రమే కాదు, భక్తుల హృదయ క్షేత్రాలలో తాత్త్వికబీజాలు విత్తే ఒక యజ్ఞం, ఈ రథోత్సవంలో స్వామివారిని దర్శించుకున్న వారికి జన్మాధి దుఃఖాలు నశించి మోక్షం లభిస్తుంది. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్స్ మునిచెంగల్రాయులు, వెంకటస్వామి, టెంపుల్ ఇన్స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్స్పెక్టర్ ధనశేఖర్, ప్రధాన అర్చకులు పార్థసారధి, అర్చకులు నారాయణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

**-అశ్వవాహనంపై శ్రీనివాసుడు**



శ్రీనివాస మంగాపురంలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో శ్రీనివాసుడు శనివారం రాత్రి అశ్వవాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. పరమాత్మను అశ్వరూపంగా కృష్ణయజుర్వేదం తెలియజేస్తున్నది. స్వామి వారు అశ్వవాహనాధిరూడుడై భక్తులకు దర్శనమివ్వడం ద్వారా కల్కి స్వరూపాన్ని ప్రకటిస్తూ కలిదోషాల నుండి భక్తులను విముక్తులను గావించారు. అశ్వవాహనంపై ఊరేగుతున్న స్వామి వారిని దర్శించుకున్న వారికి ఆత్మశుద్ధి కలుగుతుందని అన్నారు.

## పంట పొలాలపై గజరాజులు దాడులు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:



ధ్వంసపశువుల రేకుల షెడ్డు

తుంబపాళ్యం అటవీ గ్రామ సమీపంలో వున్న పంట పొలాలపై శుక్రవారం రాత్రి గజరాజులు దాడులు చేశాయి. ఈ దాడుల్లో వరి, మామిడి, అరటి పంటలతో పాటు పశువుల షెడ్డు ధ్వంసం అయ్యింది. గ్రామానికి చెందిన దేవేంద్ర పశువుల రేకుల షెడ్డును ఏనుగులు పూర్తిగా ధ్వంసం చేశాయి. అలాగే అతని మామిడి తోటలోని మామిడి చెట్లను విరిచి పడవేశాయి. మునిరాజుకు చెందిన నాలుగు ఎకరాల వరి పంటను ఏనుగులు ధ్వంసం చేశాయి. అలాగే మల్లన్న అనే రైతుకు చెందిన వరి, చిరంజీవి అనే రైతుకు చెందిన బోరు మోటరును ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. ఈ ఏనుగుల గుంపు సమీప అటవీ ప్రాంతం నుండి వచ్చి పంట పొలాలను ధ్వంసం చేయడం పరిపాటిగా మారింది. తమకు జరిగిన పంట నష్టంపై బాధిత రైతులు అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు.

## హర హర మహాదేవ..శంభోశంకర

### ఓంకార నాదంతో ప్రతిధ్వనించిన దక్షిణకైలాసం







పూల అలంకరణలో శివయ్య, నందీశ్వరుడు, బంగారు నగల అలంకరణలో శివయ్య, పార్వతీదేవిలు దర్శనం



శివయ్య దర్శనానికి నిరీక్షిస్తున్న భక్తజనం

(శ్రీకాళహస్తి - ప్రభాతవార్త)
మోక్ష ప్రదాత..మూగజీవాలకు ముక్తి అనుగ్రహించిన పరమేశ్వరుడు, స్వయంభువు శ్రీకాళహస్తీశ్వరుడు కొలువు దీరిన దక్షిణకైలాసం హర హర మహాదేవ..శంభోశంకర.కైలాసనాథా కరుణించవయ్యా, నీ దర్శన భాగ్యంతో మము పునీతులు చేసి మోక్ష ప్రాప్తి కల్పించవయ్యా అంటూ భక్తుల శివనామస్మరణలతో మారుమ్రోగింది. ఓవైపు భక్తజనాల శివనామస్మరణలు, మరోవైపు శివయ్య పరమ భక్తులు ఓంకార శంఖారావనాదాలు, ఇంకోవైపు డమరుక నాధాలుతో దక్షిణకైలాసం శివోహం అంటూ భక్తిపారవశ్యంతో పులకించింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కైలాసగిరి పంక్తుల్లో కొండాకోనల్లో వెలసిన శివాలయాలు భక్తజన సంద్రంలా మారి ఆధ్యాత్మిక శోభతో అలరించాయి. స్వయంభువు యుగయుగాల నుంచి శ్రీకాళహస్తి కొలువుదీరి భక్తజన కొంగుబంగారంగా భాసిల్లుతూ భక్తిభావంతో మారేడుదళం సమర్పించినా మోక్షమిస్తూ తన ఏర్పశోకితే చాలు మోక్షాన్ని అనుగ్రహిస్తాను అన్నట్లు శ్రీకాళహస్తిలో పాదం మోపితే చాలు మోక్షాన్ని అనుగ్రహిస్తున్న పరమేశ్వరుని కృపాకటాక్షాలు అందుకోవడానికి భక్తజనం తెల్లవారుజామునుంచే శివయ్య జాగారానికి బారులుతీరారు. చంటిబిడ్డలు, వయోవృద్దులు, ముసలిముతక, తెల్లవారుజామునుంచే చన్నీటిస్నానం ఆచరించి శివశివా అంటూ ఆయా ప్రాంతాల్లో ఉన్న శివాలయాలకు తరలివెళ్లారు. మహిళలు ఉపవాసదీక్షలతో మొక్కులుకట్టి సంతానంకోసం ముత్తైదు తనంకోసం దేవేరి జ్ఞానాంబకు ముడుపులు కట్టారు.

**శోభించిన శ్రీకాళహస్తీశ్వరాలయం**

శ్రీకాళహస్తీశ్వరాలయం మహాశివరాత్రి పర్వన సందర్భంగా పుష్పాలంకరణలు విద్యుత్ దీపాల అలంకరణలతో శోభాయమానంగా కనువిందుచేసింది. అటు బెంగుళూరు పుష్పాలు, మరోవైపు పచ్చటి అరటిమామిడితోరణాలతో శోభితం మారగా విద్యుత్ దీప కాంతులతో ధగధగా మెరిసింది. కాగా వాయులింగేశ్వరుని దర్శనానికి సుదూర ప్రాంతాలనుంచి మరియు స్థానిక చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తెల్లవారుజామునుంచే ఆలయానికి తరలివచ్చారు. ఉదయం రెండుగంటల నుంచే సర్వదర్శనానికి అనుమతించడంతో ఆయా క్యూలైన్లలో రద్దీలేకుండా వచ్చిన జనం వచ్చినట్లే సుదర్శనం చేసుకుని వెళ్లిపోయారు. ఉదయం 12గంటల వరకు క్యూలైన్లలో ఓమోస్తరుగా భక్తులుతో ఉండగా సాయంత్రానికి క్యూలైన్లు భక్తుల రద్దీతో నిండిపోయింది. సుమారు లక్ష మందిశివయ్యను దర్శించుకున్నట్లు అంచనా. పోలీసులు చక్కటి బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారు. డిఎస్‌పి విశ్వనాధం,సిఐ అంజూ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక సిఐలు, ఎస్ఐలు చక్కటి సమన్వయంతో అడిషనల్ ఎస్‌పి సుప్రజ భక్తజనాలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా బందోబస్తు నిర్వహించారు. దేవస్థానం సిబ్బంది కూడా చక్కటి ఏర్పాట్లు చేసి భక్తులకు సహకారం అందించారు. కాగా ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా నిరంతరాయంగా భక్తులకు ఆలయం తరపున ఉచిత ప్రసాదాలు అందించారు. అదేవిధంగా ఆలయంలోపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు నీళ్లప్యాకెట్లు, పాలును పంపిణీచేశారు. పవిత్రస్వర్ణముఖినదిలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పలువురు పెద్దల ఆత్మశాంతికోసం పిండప్రధానాలు చేశారు. కాగా మహిళలు స్వర్ణముఖినదిలో పవిత్రస్నానాలు ఆచరించి తడిబట్టలతోనే శివయ్య సన్నిధికిచేరి మూడభక్తితో ప్రణమిల్లారు. భక్తులు శివయ్యను దర్శించుకుని ఉపవాసదీక్షతో శివజాగరణకు సిద్ధమయ్యారు.

**ఆ ఇద్దరి చొరవ అభినందనీయం:**

ఈ సారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో కీలకమైన శివరాత్రి పర్వదినాన్ని స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి,ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు నాలుగు రోజులుగా ఆలయంలో తిష్టవేశారు.రెండు రోజులుగా ఇరువురు కంటిమీద కునుకు లేకుండా శ్రమించారు. శివరాత్రి పర్వదినాన శాసనసభ్యుడు స్వామి గర్భగుడి వద్ద, చైర్మెన్ అమ్మవారి ఆలయం వద్ద ఇఓ సాగర్‌బాబు గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద తిష్ట వేశారు.వచ్చిన విఐపిలకు తగిన రీతిలో రిసీవ్ చేసుకుంటూ సుదర్శనం కల్పించారు.

## ఘనంగా మహా శివరాత్రి వేడుకలు





అయ్యప్పస్వామిని దర్శించుకుంటున్న మంత్రి పెద్దిరెడ్డి తదితరులు, ప్రత్యేక అలంకరణలో శ్రీవారి పాదక్షేత్రం

సదుం,కల్లూరు,సోమల, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త
మహా శివరాత్రి పండుగను శనివారం శైవ క్షేత్రాలలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఉదయం పులిచెర్ల మండలంలోని రెడ్డివారపల్లెలో వెలసిన శ్రీభ్రమరాంబసమేత స్వయంభు మల్లికార్జునస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం దేవళంపేటలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దర్శించుకున్నారు. అక్కడి నుంచి సదుం మండలం యర్రాతివారిపల్లెలోని అయ్యప్ప స్వామి వారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అక్కడ ఉన్న వినాయక, ఆంజనేయ,నాగమల్లేశ్వరస్వామి, నవగ్రహాలకు పూజలు చేసుకుని అయ్యప్పను దర్శించుకున్నారు.అనంతరం నడిగడ్డ మతుకువారిపల్లె మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. అక్కడ ప్రయివేటుగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సోమల మండలం పెద్దఉప్పరపల్లెలోని దుర్గంకొండను దర్శించుకున్నారు. అక్కడ కొలువైన గార్గేయ మునీశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అక్కడే నిర్మాణంలో ఉన్న అతిధి భవనాలను ఆయన పరిశీలించారు. త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో ప్రజలు ఎల్లప్పుడు సుభిక్షంగా ఉండాలని పరమేశ్వరున్ని కోరుకున్నట్లు చెప్పారు. ఆయన వెంట చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప,తితిదే బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, జడ్పీటీసీ లు సోమశేఖరరెడ్డి, మురళీధర్, అమాసమోహన్,ఎంపీపీ ఎల్లప్ప,సురేంద్రనాడరెడ్డి, ఈశ్వరయ్య,సీఐ మధుసూధనరెడ్డి,వైస్ ఎంపీపీ అమరావతి, గృహసారథుల మండల కన్వీనర్లు ప్రకాష్‌రెడ్డి, మధు, వైకాపా నాయకులు బాబురెడ్డి, నాగబూషణరెడ్డి,పుర్రాజు, తిమ్మారెడ్డి,రవీంద్రరెడ్డి,పాపిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని వీరభద్రస్వామి వారి ఆలయం, సుబ్రమణ్యస్వామి వారి ఆలయం,కొత్తపల్లె శ్రీవారిపాదక్షేత్రం,జంగంపల్లె కాశీవిశ్వశ్వరస్వామి ఆలయం, పుట్టావారిపల్లె దేవళంబోడు మల్లికార్జునస్వామి వారి ఆలయాలలో ఉదయం నుంచి స్వామి వార్లకు అభిషేకాలు, యాగాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానాలు ఏర్పాటు చేశారు.

## నందివాహనంపై భోళాశంకరుడు సింహవాహనంపై దేవేరి



నంది,సింహవాహనాలపై ఆదిదంపతుల దర్శనం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయం నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి కన్నులపండువగా నంది వాహనంపై కైలస నాధుడు దర్శనమిచ్చారు.అమ్మవారు సింహావాహనంపై భక్తజనకోటికి దర్శనమిచ్చారు.వైష్ణవాలయాల్లో గురుడసేవకు ఎంతటి ప్రాముఖ్యత ఉందో శ్రీకాళహస్తీశ్వరుడుకి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నందిసేవకు అంతే ప్రాముఖ్యత ఉంది. అర్ధరాత్రి దాటిన తర్వాత స్వామిఅమ్మవార్ల లాకర్లో ఏడు వారాల నగలతో చక్కగా అలంకరించి నగరోత్సవానికి తీసుకవచ్చారు. స్వామి అమ్మవార్లను అలయంలో ముస్తాబు చేసి బొయి లు మోసుకుంటూ ఉత్తరగోపురం నుంచి పట్టణానికి తీసుకు వచ్చారు. దేవాంగుల మండపంలో స్వామిఅమ్మవార్లను దించి వెండి నంది వాహ నంపై స్వామివారిని,వెండి సింహవాహ నంపై అమ్మవారిని ప్రతిష్టించారు. సాధారణంగా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పదిరోజుల వాహనాలకు ఎంతో ప్రాశ్యస్తం ఉంది.మొదటి రాత్రి దేవరాత్రి రెండవ రాత్రి భూత రాత్రి మూడవరాత్రి గంధర్వ రాత్రి నాల్గవ రాత్రినాగరాత్రి ఐదవరాత్రిని శివరాత్రి అంటారు.సాగర మదనంలో ఉద్భవించిన హాలహాలాన్ని తాకిన పరమేశ్వరుడు కన్నురెప్పపాటు విశ్రయించటంతో అందోళచెందిన భక్తులు దేవతలు హాలహాలాన్ని సేవించిన భోళాశంకరుడు మేల్కొన్నగా భక్తులు అనందోత్సాహాలతో అయనను నందిపై ఊరేగించారని చెబుతారు. అందుకే శివుడు నీలకంఠుడై మత్యుంజయుడైనా సందర్భ ంగానిర్వహించే ఉత్సవాలను నందిసేవ అంటారు.ఈ సేవకు ఎంతో ప్రాముఖ్యత ఉంది.రాత్రి 11 గంటలనుంచి వేకువ జాము వరకు స్వామిని నందిపై దర్శించుకోవటం శ్రేయస్సుకరమని అందుకే శివరాత్రి జనజాగరణల్లో నంది సేవకు అత్యంత ప్రాముఖ్యత ఉందంటారు.నందితిలకించటానికి చుట్టూ ప్రక్కల గ్రామాల నుంచి భక్తులుచతండోపతండాలుగా తరలి వచ్చారు. శనివారం రాత్రి 12గంటలకు పైగా నందిసేవ ప్రారంభమైంది.

**భక్తుల సందడి...**

నంది సేవకు గతంలో ఎన్నడూ హాజరు కానంత మంది భక్తులు హాజరయ్యారు. ఉత్సవాన్ని మొదట దేవస్థానం హారతితో ప్రారంభిం చారు. ఉత్సవం పట్టణంలోని నాలుగుమాడా వీధుల్లో భారీ ఎత్తున బాణ సంచా కాలుస్తూ శోభాయమానంగా సాగింది.ముందు ఒంగోలు నుంచి వచ్చిన రెండు నందులుప్రత్యేకాకర్షణగా మారాయి.బొమ్మ ఏను గులు ఎంతో ఆకర్షణీయంగా మారింది. హైదరాబాదు బ్యాండు మేళాలు,కేరళ పంచవాయిద్యాలు, సంప్రదాయ డోలు సన్నాయిల నాదాలు, కోలాటాలు, వేదపండితుల వేద ఘోషతో ఉత్సవం సాగింది. ఉత్సవంతో పాటు శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి దంపతులు, కుమార్తె బియ్యపుపవిత్రారెడ్డి, కుమారుడు ఆకర్షరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరుతారక శ్రీనివాసులు అధికార చైర్మెన్ హోదాలో వెంటరాగా ఉత్సవం కన్నుల పండువగా సాగింది.



. మహాశివరాత్రి పండగను వి.కోట మండలంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కర్ణాటక కమ్మసంద్ర కోటి లింగాల ఆలయంలో **108** అడుగుల మహాశివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## టోల్‌ప్లాజా వద్ద ప్రమాదం

## యువకుడు సజీవదహనం



పుంగనూరు ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :
పుంనూరు నేషనల్‌హైవే టోల్‌ప్లాజావద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డుప్రమా దంలో ద్విచక్రవాహనంలో వస్తున్న ఒక వ్యక్తి ప్రమాదానికి గురై సజీవదహనమయ్యాడు. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. పలమనేరు పట్టణంకు చెందిన ఆదిల్ అనేవ్యక్తి మదనపల్లిలో జరుగుతున్న ఇస్తిమాకు పోవడానికి తన ద్విచక్ర వాహనంలో వేగంగా వస్తూ రోడ్డుపై ప్రమా దానికి గురైయ్యాడు.ద్విచక్రవాహనంలో మంటలు చెలరేగడంతో పాటు తనకు మంటలు అంటుకుని తనుకూడా పూర్తిగా దగ్ధమై సజీవదహనమయ్యాడు.పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## దైవచింతనతో మానసిక ప్రశాంతత

: డిప్యూటీ సీఎం నారాయణస్వామి



చవటగుంట ఆలయంలో దైవదర్శనం చేసుకుంటున్న డిప్యూటీసీఎం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :
దైవచింతనతో మానసిక ప్రశాంతత వస్తుందని రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామి పేర్కొన్నారు. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శనివారం చవటగుంటలో వేలసిన ఆవుదేవర నందీశ్వరస్వామి ఆలయ దర్శనం చేసుకున్నారు. ముందుగా ఆలయ నిర్వహకులు మర్యాదపూర్వకంగా ఆయనకు ఘనంగా స్వాగతం పలికి దుశాలువతో సన్మానించారు. అనంతరం స్వామి దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో ప్రజలలో మానసిక ప్రశాంతత వస్తుందన్నారు. మనిషిని నడిపించేది నమ్మకమని గుర్తించాలని హితువు పలికారు. ప్రజలకు శాంతియుతంగా పర్వదినాలు వేడుకగా జరుపుకుని ప్రశాంతజీవనం గడపాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కారు బోల్తా ఒకరు మృతి

చంద్రగిరి ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:
డ్రైవర్ అవగాహనా లేమి కారణంగా రెండు బస్సులను ఢీ కొట్టి కారు బోల్తాపడిన ఘటన రవణప్పగారిపల్లి వద్ద శనివారం వేకువజామున చోటుచేసుకున్నది. పాండిచ్చేరి నుండి తిరుపతికి కారులో వస్తున్న యాత్రికులు పనపాకం పంచాయతీ, రవణప్పగారిపల్లి వద్ద వేకువజామున ముందు వెళుతున్న వాహనాన్ని అధిగమించబోయి ఎదురుగా వస్తున్న బెంగుళూరు బస్సును ఢీ కొట్టడంతో ఆ ధాటికి అటుగా వస్తున్న మరో బస్సు ఢీకొట్టి కారు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రాజశేఖర్ (45) మృతి చెందగా, కారులో వున్న డ్రైవర్ భరత్, పెరుమాళ్, విజయ్ శంకర్, హరీష్, సంజిత తీవ్రగాయలపాలయ్యారు. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయ్యింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించారు. మృతదేహాన్ని ఓస్టమార్టం నిమిత్తం మెడికల్ కళాశాలకు తరలించారు.

### శాసన మండలి ఎన్నికల దృష్ట్యా స్పందన రద్దు : కలెక్టర్

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:
జిల్లాలో ఆంధ్రప్రదేశ్ శాసనమండలికి జరగనున్న ఎన్నికల దృష్ట్యా మార్చి 21వరకు ఎన్నికల కోడ్ ఉన్నందున అధికారులు ఎన్నికల విధులలో నిమగ్నమై ఉన్నందున ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమం ఈనెల 20, 27, మార్చి 6, 13, 20వ తేదీలలో రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నిక పూర్తయిన అనంతరం స్పందన కార్యక్రమం మార్చి 27 సోమవారం నుండి యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## చిత్తూరులో ఇద్దరు నేతలతోనే టిడిపి నాశనం

### - సస్పెన్షన్‌కు గురైన షణ్ముగం ధ్వజం



చిత్తూరు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:
చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో జాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర ఫ్లాప్ కావడానికి తానే కారణమని తెలుగుదేశం రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తనను రాష్ట్ర తెలుగుదేశం బిసీ సెల్ ప్రధాన కార్యదర్శి పదవి నుండి తప్పించడంతో పాటు చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని క్లస్టర్ యూనిట్లను రద్దు చేశారని చిత్తూరు మాజీ టౌన్ బ్యాంకు చైర్మన్ షణ్ముగం ధ్వజమెత్తారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, జిల్లా పార్టీ అధ్యక్షుడు పులివర్తినానిల ఏకపక్ష నిర్ణయా లతోనే పార్టీ నాశనం అయ్యిందని ఆయన ఆరోపించారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభమైన మంగసముద్రం నుండి లక్ష్మీథియేటర్ వరకు తన డివిజన్ అని ఆ డివిజన్‌లో పాదయాత్ర విజయవంతం అయ్యిందన్నారు. పార్టీకి విశేష సేవలు అందించి ఇటీవల మృతి చెందిన జహాంగీర్ ఖాన్ కుటుంబ సభ్యులు, ముస్లీం మైనార్టీలు పాదయాత్ర చేస్తూ వచ్చిన నారా లోకేష్‌ను కలవడానికి ప్రయత్నిస్తే ఈ ఇద్దరు నాయకులే నారా లోకేష్ ముస్లీంలను కలుసుకోకుండా చేశారని ఆరోపించారు. బిసీలతో నారా లోకేష్ ముఖాముఖి నిర్వహించడానికి అంగీక రించడంతో ఏర్పాట్లు చేస్తుంటే ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పులివర్తినానిలు అడ్డుకొని ఆ కార్యక్రమం రద్దు చేశారన్నారు. ఈ విషయంపై నిలదీస్తే ఆ సమయంలో జిల్లా దేశం అధ్యక్షుడు పార్టీ పరిశీలకుల సమక్షంలోనే తనపై దాడి చేశారని ఆరోపించారు.గతంలో రావూరి ఈశ్వర్‌రావు, మాపాక్షి మోహన్‌లు వీరి ఏకపక్ష నిర్ణయాలతో పార్టీకి దూరం కాగా ప్రస్తుతం తన వంతు వచ్చిందన్నారు.

## మహాశివరాత్రి పర్వదినాన ఉదయం “భోగితేరు”పై పరమశివుడు దర్శనం

### -రాత్రి నందివాహనంపై కటాక్షం



తిరుపతి,,ఫిబ్రవరి 18ప్రభాతవార్త:
తిరుపతిలోని కపిలేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో “భోగితేరు”జరిగింది. ఉత్సవమూర్తిసోమస్కంధమూర్తి భోగితేరుపై అధిరోహించి పురవీధుల్లో ఊరేగారు. అలాగే రాత్రి స్వామివారు అధికార నందిపై ఊరేగూతూ భక్తుల నుంచి కర్పూర హారతులు అందుకున్నారు.భక్తుల శివనామస్మరణల మధ్య వాహనసేవలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఇఓ దేవేంద్రబాబు, ఎఇఓ పార్థసారధి, ఆలయ సూపరింటెండెంట్ భూపతి, భక్తులు పాల్గొన్నారు. తెల్లవారుజామున లింగోద్భవ అభిషేకంలో టిటిడి జెఇఓ సదాభార్గవి, వీరబ్రహ్మం, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

గంగాధర నెల్లూరు ఫిబ్రవరి 18 ప్రభాత వార్త:

మండల పరిధిలోని శివ క్షేత్రాలైన కొట్రకోన ,మల్లీశ్వరాలయం,సిద్దేశ్వర కొండలోని సిద్దేశ్వర ఆలయం, గంగాధర నెల్లూరులోని గంగాధరేశ్వర ఆలయం,మహదేవ మంగళంలోని మహాదేశ్వరాలయం,సరివిరెడ్డి పల్లిలోని శ్రీ గుర్రప్ప దేవస్థానం వెజ్జుపల్లెలోని ఆవుదేవర నందీశ్వరాలయం ఆలయాలుశనివారం ఉదయం నుంచి శివ భక్తులతో కిటకిలాడాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, రాత్రి కోలాటాలు నిర్వహిం చారు. శనివారం రాత్రి లింగోద్‌బావ పూజను అర్చకులు సాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మనోహర్ రెడ్డి,ప్రకాష్ శెట్టి, హరిప్రసాద్,రామూర్తి రాయుడు,జగన్నాధ నాయుడు,యుగంధర్ ఆచారి,ఎస్ సుభాషిని శేఖర్, రామక్క,గోవిందులతో పాటు పలుపురు భక్తులు పాల్గొని స్వామి వారి కృప కటాక్షాలకు పాత్రులైనారు.

## పెద్దల నుండి రక్షణ కల్పించండి

చిత్తూరు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:



ప్రేమ వివాహం చేసుకొన్న తమకు ఇటు పెళ్ళికుమార్తె, అటు పెళ్ళికుమారుడి కుటుంబాల నుండి ప్రమాదం పొంచి వుందని తమకు వారి నుండి రక్షణ కల్పించాలని ఓ ప్రేమజంట విజ్ఞప్తి చేసింది. ప్రెస్‌క్లబ్‌లో శనివారం వివాహం చేసుకొన్న ప్రేమజంట విలేకరులతో మాట్లాడుతూ గుర్రప్పనాయుడు వీధికి చెందిన జాహ్నవి, ముత్తుమారియమ్మన్ కోవిల్ వీధికి చెందిన భానుచందర్‌లు అయిన తాము ఇరువురు మూడేళ్ళుగా ప్రేమించుకొన్నామన్నారు. తమ ప్రేమను విడదీయడానికి గతంలో ఇరు కుటుంబాల పెద్దలు పలు ప్రయత్నాలు చేశారన్నారు. తమ ప్రేమ విషయంగా తమ స్నేహితులపై దాడి సైతం జరిగిందన్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం ఇద్దరు మేజర్లు కావడంతో ఇద్దరు వెళ్ళి వివాహం చేసుకొన్నామని తమకు తమ కుటుంబ పెద్దల నుండి రక్షణ కల్పించా లనికోరారు. ఈమేరకు తాము పోలీసులను సైతం ఆశ్రయించి రక్షణ కల్పించాని కోరనున్నామని తెలిపారు.

## చంద్రబాబును చూసి వైకాపాలో వణుకు - దేశం అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు

గుడిపాల, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:



ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడును చూసి సిఎం వైఎస్ జగన్మోహ న్‌రెడ్డికి వణుకు పట్టిందని అందుకే ఆయనను బహిరంగ సమావేశాల్లో మాట్లా డనీయకుండా చేస్తున్నారని గుడిపాల మండల దేశం అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు పర్యటనను పోలీసులు అడ్డుకొన్న నేపథ్యంలో శనివారం గుడిపాలలో దేశం నాయకులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో దేశం నాయకులు చంద్రమోహన్, గొల్లహేమాద్రి, మురళీనాయుడు, రాజా, ఉదయ, విక్టోరియా, హైజాక్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మల్లేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



మహాశివరాత్రి సందర్భంగా గుడుపల్లె మండలం మల్లప్ప కొండపై వెలసిన శ్రీ మల్లేశ్వరస్వామిని శనివారం చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ దర్శించుకున్నారు. ఈసందర్భంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజలో పాల్గొన్నారు. కుప్పం నియోజకవర్గ ప్రజలపైఈశ్వరుడి కరుణాకటాక్షాలు ఉండాలని మహాశివుడి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, జడ్పీటిసి కృష్ణమూర్తి, కో కన్వీనర్ రామూర్తి, రామకుప్పం కన్వీనర్ బాబురెడ్డి, సర్పంచ్ అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబును పోలీసులు అడ్డుకోవడం దారుణం

**శాంతిపురం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త** తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలో మాజీ సిఎం చంద్రబాబునాయుడును పోలీసులు అడ్డుకోవడం దారుణమని మాజీ ఎమ్మెల్యే గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద తెదేపా నేతలు కళ్లకు గంతలు కట్టుకుని నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేయడం దారుణమన్నారు. చంద్రబాబు పర్యటనకు అనుమతులు తీసుకున్నా పోలీసులు అడ్డుపడి 72 ఏళ్ల వయసులో ఆయన్ను నడిపించడం దారుణమన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్దన్‌రెడ్డి, మణి, నాగరాజు, గోపాల్, రాజు, రమేష్, గోవింద రాజులు, బసవరాజు, కేశవులు, నాగరాజు, రామకృష్ణ, మునేగౌడు, కోదండప్ప, అనసూయ, చంద్రకళ, సుగుణమ్మ, సింగిరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్

కుప్పంరూరల్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



గుడుపల్లె మండలం మల్లప్ప కొండపై వెలసిన శ్రీ మల్లేశ్వరస్వామికి మహాశివరాత్రి సందర్భంగా కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నాగరాజు, విజయ్‌కుమార్, ఆంజనేయస్వామి గుడి ఛైర్మన్ కుమరేష్, మున్సిపల్ అధికార ప్రతినిధి ఇంతియాజ్, కో కన్వీనర్ జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీ ఫలితాలు విడుదల

పలమనేరు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:

తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి జాతీయ స్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీ ఫలితాలను శనివారం అధ్యక్షులు తులసినాథం నాయుడు ప్రకటించారు. హైదరాబాదుకు చెందిన సాయిహర్షిత, అభిషేక్, సంకీర్త్, అక్షిత్ ,చౌడేపల్లెకు చెందిన వర్షిణి, ముషీరాబాద్‌కు చెందిన శ్రియాన్, పంజాణికి చెందిన ఛరిష్మాభాను, మొహిదీపట్నంకు చెందిన రాజదుహిత్‌రెడ్డి, పలమనేరు చెందిన రాజేష్, గగనదీపిక, అనంతపురం జిల్లా నార్పలకు చెందిన ఆకుల లక్ష్మీరాయ్, గంగవరంకు చెందిన మధురాక్షి, సాజియా, సాయినగర్‌కు చెందిన రాజేష్, సంగారెడ్డికి చెందిన క్షితీష్, మణికొండకు చెందిన శ్రీనివాస్ ,కూర్మాయికి చెందిన రమ్యశ్రీ, చింతమాకులపల్లెకు చెందిన డింపుల్, పుదిపట్లకు చెందిన ధనంజయ ఎంపికయ్యారన్నారు. వీరికి ఈనెల 21న మాతృభాషాదినోత్సవం సందర్భంగా ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందిస్తామని ఆయన తెలిపారు.

## అభిషేక ప్రియా...అభీష్టద మృత్యుంజయా...!

చౌడేపల్లి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



మాఘమాసం...కృష్ణపక్షం...త్రయోదశి(శని) నడిరాత్రి ఉద్భవించిన సృష్టి కర్త పరమశివుడు...దేవదేవుని శివరాత్రి సందర్భంగా మండలంలోని శైవా లయాలన్నీ భక్తులతో కళకళలాడాయి. స్థానిక మృత్యుంజ యేశ్వర స్వామి, పుదిపట్ల పంచలింగాలు, లద్దిగం నీలకంతేశ్వరస్వామి, చారాల కాశీవిశ్వేస్వ రాలయం, గోసలకురపల్లి శరభరాయస్వామి, ఎ.కొత్తకోట చంద్రమౌళీశ్వ రాలయం, ఎర్రపల్లినందీశ్వరాలయాల్లోవిశేషాభిషేకాలు, పూజలుజరిగాయి. స్థానిక మృత్యుంజయేశ్వరా లయంలో రాత్రంతా భక్తులు జాగారణ వుండి స్వామివారికి జాముల అభిషేకాల్లో పాల్గొన్నారు. నందీశ్వ రాలయం ఎర్రపల్లిలో జాతర జరిగింది.

## రాష్ట్రంలో రాజ్యాంగ వ్యతిరేక పాలన

- డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట కళ్ళకు గంతలు కట్టుకొని 'దేశం' నాయకులు నిరసన



**చిత్తూరు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** రాష్ట్రంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాజ్యాంగ మౌళిక స్వరూపానికి వ్యతిరేకంగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ మేయర్ కఠారి హేమలతలు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆరోపిస్తూ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ మేయర్ కఠారి హేమలతలు శనివారం చిత్తూరు దర్గా సర్కిల్ ఆవరణలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. శాంతిభద్రలను రక్షించాల్సిన పోలీసులతోనే ప్రభుత్వం శాంతి భద్రతలకు భంగం వాటిల్లేల చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో దేశం నాయకులు కాజూరు బాలాజీ, కాజూరు రాజేష్, కార్యాలయ పార్టీ కార్యదర్శి మోహన్‌రాజ్, నాయకులు దుర్గాచౌదరి, రఘు, రాజా, కుమార్, ఆనంద, శేషాద్రినాయుడు, శంకర్, ఈశ్వర్, శివ, నవాజ్, వరలక్ష్మీ, ప్రియాంక, రాణేమ్మ పాల్గొన్నా రు.

## కళ్లకు గంతలు కట్టి టిడిపి నిరసన

గంగాధర నెల్లూరు ఫిబ్రవరి 18 ప్రభాత వార్త:

ఇటీవల తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో రాష్ట్రానికి ఇదేం కర్మకార్యక్రమంలో భాగంగా రోడ్‌షోను అడుగడుగునా అడ్డుకుంటున్న జగన్ సర్కార్‌పై టిడిపి నేతలు కళ్ళకు గంతలు కట్టి నిరసన తెతియజేశారు. ఈ సందర్భంగా శనివారం గంగాధర నెల్లూరు నియోజక వర్గంలోని ఆరు మండలాలకు జెందిన టిడిపి నాయకులు బస్టాండు కూడలి నుంచి భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం వరకు కళ్ళకు గంతలు కట్టి భారీ ర్యాలీని నిర్వహించారు. అంబేద్కర్‌విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు స్వామిదాసు, జయశంకర్, రాజేంద్రలతో పాటు వెంకటేష్, దేవసుందరం, జగన్నాధ రెడ్డి, మునిరాజులు, శ్రీధర్ యాదవ్‌లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అరాచక పాలనకు నిదర్శనం

- అంబేద్కర్ చిత్రపటానికి 'దేశం' నాయకులు వినతి

యాదమరి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:



రాష్ట్రంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన అరాచక పాలనకు నిదర్శమని యాదమరి మండల దేశం అధ్యక్షుడు మొరార్జీ ధ్వజమెత్తారు. యాదమరి మెయిన్ రోడ్డులో శనివారం మండల పార్టీ అధ్యక్షుడు మొరార్జీ ఆధ్వర్యంలో తెలుగుదేశం నాయకులు రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్ అంబే ద్కర్ చిత్రపటానికి రాష్ట్రంలో రాజ్యాంగానికి విరుద్దంగా పాలన సాగిస్తున్నారని ఆరోపిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగామొరార్జీమాట్లాడుతూప్రభుత్వంపోలీసులతోనే ప్రజాస్వామ్యంను అణచివేయ డానికి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేశం కార్యదర్శి హేమగిరి, మండల ప్రధాన కార్య దర్శి వెంకటేశ్‌రబ్బీ, మండల మహిళ అధ్యక్షురాలు చిత్ర, జిల్లా అధికార ప్రతినిధి అమరనాధనాయుడు, మండల తెలుగు యువత అధ్యక్షుడు గుణశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఆలయానికి ఆభరణాలు వితరణ

సదుం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:

సదుంలోని గార్గేయనది ఒడ్డున వున్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి వారి ఆలయానికి శనివారం భక్తులు రూ.30వేలు విలువ చేసే ఆభరణాలను వితరణగా ఇచ్చారు. పీలేరుకు చెందిన రిటైర్డు టీచరు రెడ్డెప్పరెడ్డి కుటుంబసభ్యులు శివరాత్రి సందర్భంగా ఆలయానికి విచ్చేసి నగలను అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించి ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మెన్ కృష్ణారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

## భక్తులకు మజ్జిగ పంపిణీ

యర్రావారిపాలెం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:

ప్రముఖ శైవ క్షేత్రం అయిన తలకోనలో శివరాత్రి సందర్భంగా తెలుగుదేశం పార్టీ అధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. తలకోనకు వచ్చే భక్తుల కు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంత రాయంగా మండల తెదేపా ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు అధ్వర్యంలో మజ్జిగ అందజేశారు. కార్యక్రమంలో అమరనాదరెడ్డి, జైపాల్‌రెడ్డి, చిన్నపరెడ్డి, శ్రీదరబాబు, లక్ష్మీదేవి, హరిశ్చంద్ర, మునిర త్నం, కేశవనాయుడు, అశోక్‌రెడ్డి, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

## వీరభద్రునికి గణనాధుని పట్టు వస్త్రసాలు సమర్పణ

ఐరాల, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:



మండల కేంద్రం ఐరాల మఠంపల్లెమిట్ట వద్ద వెలసిన శ్రీభద్రకాళిసమేత వీరభద్రస్వాములవారికి మహాశివరాత్రి సందర్భంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం తరపున శనివారం పటు ్టవస్త్రాలను సమర్పించారు. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు, ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, అర్చకులు మఠంపల్లె చేరుకుని స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఎమ్మెల్యే వెంట కాణిపాకం సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డి, స్థానిక వైకాపా నాయకులతో పాటు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల వైఖరికికి నిరసనగా సహాయ నిరాకరణ

ఐరాల, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:



అనపర్తిలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు నిర్వహించిన ఆదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమానికి పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించినందుకు నిరసనగా పోలీసులకు సహాయ నిరాకరణ చేస్తున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ మల్లారపల్లె గిరిధర్‌బాబు తెలిపారు. పోలీసుల వైఖరికి నిరసనగా శనివారం మండల కేంద్రం ఐరాలలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పోలీసులు రాజ్యాంగ ఉల్లంఘనపై వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈమేరకు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లత, మండల టీడీపీ నాయకులు దేవాన్ష్, బాబునాయుడు, శేషాద్రినాయుడు, దయానందమండడి, వీరభద్ర, ఖయ్యూం, అహ్మద్, జలీల్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

## గోసంరక్షణ ట్రస్ట్‌కు లక్ష విరాళం

కాణిపాకం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్నశ్రీసిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు శనివారం ఓ భక్తుడు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు బెంగుళూరుకు చెందిన లక్ష్మీనారాయణ అనే భక్తుడు ఈపథకానికి లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాలను కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ శ్రీధర్‌బాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబులకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## ప్రతిపక్షాల అణిచివేత దోరణి సరికాదు -టిడిపి

పలమనేరు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:



ప్రభుత్వం ప్రతిపక్షాల అణిచివేత దోరణితో వ్యవహరిస్తుందని స్థానిక టిడిపి నాయకులు విమర్శించారు. అనపర్తి సంఘటనను నిరసిస్తూ శనివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పోలీసులే టిడిపి కార్యకర్తలను రెచ్చగొట్టి వారిపై లాఠీ చార్జీ చేసి శాంతి భద్రతలకు విఘాతం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్రమణ్యంగౌడ్, ఖాజా పీర్, మదన్, శ్రీధర్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పాండురంగేశ్వర స్వామిని దర్శించుకున్న నేదురుమల్లి

వాకాడు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త

మహాశివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని పంట్రంగం గ్రామంలో ఉన్న శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ పాండురంగేశ్వర స్వామిని, వాకాడులోని నాగేశ్వర స్వామిని శనివారం రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డు ఛైర్మన్ తిరుపతి జిల్లా వైకాపా అధ్యక్షుడు వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త, నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి దర్శించుకున్నారు. వేద మంత్రోత్సవాలు నడుమ ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ వాసుదేవ రెడ్డి, మాజీ ఎంపిపి, మధుసూధన్ రెడ్డి, వాకాడు వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ అజిత్ కుమార్ రెడ్డి, మూల పడవ సర్పంచ్ కిషోర్ కుమార్, పూడి రాయి దొరువు ఉప సర్పంచ్, వెంకటరత్నం, వైకాపా నాయకులు విజయరత్నం, ప్రదీప్ రెడ్డి తదితరులు నేదురుమల్లిని ఘనంగా స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ పూజా కార్యక్రమంలో ఆయన వెంట వాకాడు సొసైటీ ఛైర్మన్ కొడవలూరు దామోదర్ రెడ్డి, జడ్పిటిసి రామకృష్ణ, వైస్ ఎంపిపి వెంకటరమణయ్య, వాకాడు ఉప సర్పంచ్ పాపా రెడ్డి రాజశేఖర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి వాకాడు సొసైటీ ఉపాధ్యక్షుడు ఏనుగు సుధాకర్ నాయుడు, దేవదాయ శాఖ, ఎస్ఐ రఘునాథ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పంట్రంగం పాండురంగేశ్వర స్వామి ఆలయం, విశ్వనాధపురం అగ్రహారంలోని శ్రీ అన్నపూర్ణ దేవి సమేత శ్రీ కాశివిశ్వనాథ్ స్వామి ఆలయం, వాకాడు నాగేశ్వర స్వామి ఆలయం, నెల్లిపూడి, తుపిలి ఆలయం ఆవరణం ప్రాంగణంలోని పలు సాంస్కృత కార్యక్రమాలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఘనంగా శివరాత్రి వేడుకలు

ఓజిలి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త



ఓజిలి మండలంలోని ఓజిలి, భట్ల కనుపూరు ఇంకా పలు గ్రామాలలో శివరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఓజిలి మండలంలోని బట్ల కనుపూరు గ్రామంలో వెలిసి ఉన్న శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో దేవాదాయ శాఖ అధికారులు, గున్నం సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు గున్నం రెడ్డి మధుసూధన్ రెడ్డి, ఎంపిపి గడ్డం అరుణారెడ్డి, సర్పంచి యనమల ఉమామహేశ్వరి, ఆలయ ఛైర్మన్ జయరామిరెడ్డి, గుడ్ల వెంకట రెడ్డి ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో ఘనంగా నిర్వహించారు. అనంతరం మేళ తాళాలు మంగళవాయిద్యాలు నడుమ స్వామి వారు, అమ్మ వారు గ్రామోత్సవం వేడుకగా నిర్వహించారు. ఆలయ పండితులు, గున్నం సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులను, ఎంపిపి దంపతులను శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేసారు.

## పేకాట స్థావరం పై పోలీసుల మెరుపు దాడులు

నిందితుల వద్ద నుంచి రూ.22,900 నగదు, ఐదు సెల్ ఫోన్లు

రెండు మోటార్ సైకిల్ స్వాధీనం పోలీసులు అదుపులో నిందితులు, పేకాట స్థావరం పై దాడులు

ఓజిలి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త

ఓజిలి మండల కేంద్రంలోని ఆరిమేను పాడు గ్రామంలో శ్రీ సాయి పెట్రోల్ బంక్ ఆఫీస్ రూమ్‌లో గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో శనివారం తెల్లవారుజామున తమ సిబ్బందితో కలిసి పేకాట స్థావరాలపై నాయుడుపేట ఎస్ఈబి సెబ్ ఇన్స్పెక్టర్ కెఆర్‌యువిఎస్ ప్రసాద్, ఓజిలి ఎస్ఐ డి. ఆదిలక్ష్మి మెరుపు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదు మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ. 22,900 రూపాయిలు నగదుతో పాటు ఐదు మొబైల్ ఫోన్లను, 2 మోటర్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడైనా జూదం ఆడినట్లు గుర్తిస్తే తమకు సమాచారం అందజేయాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఎస్ఈబి సెబ్ ఇన్స్పెక్టర్ కె.ఆర్ యువిఎస్ ప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది రమణయ్య, వెంకటేశ్వర్లు, సురేష్, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నాగతీర్థంలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

నగరి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:



నగరి మండలంలోని ముడిపల్లి గ్రామంలో నాగతీర్థంపై వెలసిన శ్రీఅన్నపూర్ణ సమేత నాగలోకేశ్వరస్వామి ఆలయంలో మహాశివ రాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. మహాకుంభాభిషేకం, రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం 6 గంటలకు అభిషేకం, 11 గంటలకు మహాభిషేకం, రుద్రపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. సాయంత్రం 6 గంటలకు శివాభిషేకం, శివపూజ అర్చకులు ఘనంగా నిర్వహించారు.

## తడ ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకలు - కిటకిటలాడిన మహిళా భక్తులు

తడ, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



తడ మండలంలోని పలు శివాలయాల్లో శనివారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శని త్రయోదశి కలిసి రావడంతో ఈ శివరాత్రికి ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. ఈ కారణంగా మహిళా భక్తులు తెల్లవారుజాము నుంచే పెద్దసంఖ్యలో ఆలయాలను చేరుకొని పూజలు, ప్రదక్షణలలో పాల్గొన్నారు. స్వామివార్లకు అభిషేకాలు, అమ్మవార్లకు అలంకరణలతో పాటు నవగ్రహాలను దర్శించుకున్నారు. పలుచోట్ల ప్రత్యేక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చినమాంబట్టులోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ కమిటీ ఛైర్మన్ చేజర్ల ముని శ్రీనివాసులు, గ్రామపెద్దల సహకారంతో అభిషేకాలు నిర్వహించారు. ఉదయం ఛైర్మన్ దంపతులు విశేష పూజలు చేయగా, టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారిచే హరికథా కాలక్షేపం, మధ్యాహ్నం వన భోజనం నిర్వహించారు. పాముల రాజయ్య కుటుంబ సభ్యులు వనభోజన ఉభయకర్తలుగా వ్యవహరించారు. వాటంబేడులోని కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ పాలక మండలి సభ్యుల ఆధ్వర్యాన గ్రామ ప్రజల విరాళాలతో మహాశివరాత్రి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అన్నదానం, రుద్రాభిషేకాలు జరిపారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అండగుండల మార్గంలోని పాడిమిట్ట వద్ద ఉన్న నాగలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం తెల్లవారుజాము నుంచే భక్తుల స్వహస్తాలతో స్వామివారికి అభిషేకాలు జరిపారు. అనంతరం పెద్దఎత్తున అన్నదానం చేశారు. తడకండ్రిగలోని బోడిలింగాలపాడు వద్ద ఉన్న భువనేశ్వరస్వామి ఆలయంలో మహిళా భక్తులు పెద్దసంఖ్యలో దీపాలు వెలిగించారు. ఇక్కడ ఒకవైపు జీర్ణోద్ధరణ పనులను నిలిపేసి మహిశివరాత్రి పర్వదినాన్ని ఘనంగా జరిపారు. ఆలయాన్ని సుందరంగా అలంకరించడంతో పాటు మహాశివరాత్రికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానాలు జరిపారు. వేనాడులోని శ్రీశృంగేశ్వర ఆలయంలోనూ శనివారం శివరాత్రి వేడుకలు జరిపారు. మొత్తంమీద తడ మండలంలోని పలు ఆలయాల్లో అటు దైవ కార్యాలతో పాటు ఇటు అన్నదానాలు జరపడం వల్ల పేదలకు కడుపు నిండింది.

## ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

- గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు

దొరవారిసత్రం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

దొరవారిసత్రం మండలం అక్కరపాక, పోలిరెడ్డిపాలెం, శ్రీధనమల్లి, బూదూరు తదితర గ్రామాల్లోని శివాలయాల వద్ద మహాశివరాత్రి వేడుకలను ఘనంగా ఏర్పాటు చేశారు. వారం రోజుల నుంచి శివాలయాలను ముస్తాబు చేశారు. విద్యుద్దీపాలంకరణలతో శివాలయాలను అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో శివాలయాలను దర్శించుకున్నారు. శనివారం గ్రామాల్లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

## శివనామ స్మరణతో మార్మోగిన శివాలయాలు

నాయుడుపేట రూరల్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం నాయుడుపేట పట్టణంతో పాటు మండల పరిధిలోని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. మహాశివరాత్రి సందర్భంగా స్వర్ణముఖి నదీ తీరాన వెలసి ఉన్న ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో భక్తులు వేడుకలు జరుపుకున్నారు. శివాలయాలు ఉదయం నుంచే భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాల ఎదుట భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకొని పునీతులయ్యారు. స్వామి వారికి పాలాభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

## ఘనంగా శివరాత్రి వేడుకలు



**వెంకటగిరి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** మహాశివరాత్రి సందర్భంగా వెంకటగిరి పట్ట ణంలోని అన్నపూర్ణాదేవి సమేత కైలాసనాథ స్వామి ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు జరిపారు. హర హర శంభోశంకర అంటూ శివాలయాలు భక్తులతో మారుమోగాయి., పట్టణంలోని శివాలయాల్లో ఘనంగా మహా శివరాత్రి వేడుకలు జరిగాయి.

## మండలంలో ఘనంగా శివరాత్రి వేడుకలు

**బాలాయపల్లి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా సుబ్రహ్మణ్యం గ్రామంలో వెలసియున్న శ్రీశ్రీ షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ సిద్దేశ్వర స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శిం చుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సుప్రభాత సేవ, గణపతి పూజ, మహన్యాస పూర్వకరుద్రాభిషేకం, శనీశ్వర పూజ ఇంకా పలు పూజలను శాస్త్రోపేతంగా వేదపండితులు నిర్వహించారు.

## వేడుకగా మహాశివరాత్రి ఉత్సవాలు

- కొండమల్లేశ్వరస్వామికి పట్టు వస్త్రలు సర్పించిన డిప్యూటీ సీఎం కుమార్తె కృపాలక్ష్మీ.

వెదురుకుప్పం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :



మహాశివరాత్రి ఉత్సవాలను పురష్కరించుకుని మండలంలోని శివాలయాలల్లో ఘనంగా వేడుకలు పూజలు నిర్వహించారు. మండలంలోగంటవారివల్లె పంచాయితీ పరిధిలోని ముతాలం మరకతసమేత సిద్దేశ్వరస్వామి ఆలయం, చవటగుంట ఆవుదేవర నందీశ్వరస్వామి ఆలయం, బ్రాహ్మణపల్లె సమీపంలోని స్వయంబు సిద్దేశ్వరస్వామి ఆలయం, తిరుమలయ్యపల్లెలోని బండికొమ్మరెడ్డమ్మ సిద్దేశ్వరస్వామి ఆలయం, మాంబేడు పంచాయితీ పరిధిలోని డిఆర్ఎన్ కండిగ వద్దగల అరుణగిరి కొండ పై వెలసిన మల్లెకొండమల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించి భక్తులకు దైవదర్శనం కల్పించారు. ఆవుదేవర నందీశ్వర ఆలయంలో వైభవంగా కళ్యాణ మహోత్సవం కనుల పండువుగానిర్వహించారు. మహాశివరాత్రి పురష్కరించుకుని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మీ స్వామివారి పట్టు వస్త్రలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిబండి నాగరాణి, జడ్పీటిసి సుకుమార్, మాజీ జడ్పీటిసి బండి గోవర్ధన్ రెడ్డి, మార్కెటింగ్ కమిటీ ఛైర్మెన్ మునస్వామి, రాష్ట్ర వైసీపీ సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి, జిల్లా వైసీపీ కార్యదర్శి కామసాని పద్మనాభ రెడ్డి, నాయకులు, భక్తులు తదితరులు

## సూళ్లూరుపేటలో మహాశివరాత్రి వేడుకలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలో మహాశివరాత్రి పర్వదినాన్ని శనివారం మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకులజాము నుంచి శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. పట్టణంలోని శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక అలంకారాన్ని, అభిషేకాలను నిర్వహించారు. అరుణోదయ అభిషేకాన్ని, తపనోదయ అభిషేకాన్ని, ప్రదోషకాల అభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి లింగోద్భవ కాలాభిషేకాన్ని భక్తుల శివనామ స్మరణల మధ్య ఘనంగా జరిపారు. అలాగే అభయశంకర ఆలయంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రాత్రి లింగోద్భవ కాలాభిషేకాన్ని నిర్వహించారు. నాగేశ్వర దేవస్థానం ఛైర్మన్ చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఆకుతోట రమేష్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. మన్నారుపోలూరులోని శ్రీసంతానేశ్వరస్వామి దేవస్థానంలో కాళంగి నది నుంచి పవిత్ర జలాలు తీసుకొచ్చి మహిళలు, వృద్ధులు, పిల్లలు తారతమ్యం లేకుండా పెద్దఎత్తున జలాన్ని తీసుకొచ్చి సంతానేశ్వరస్వామికి అభిషేకం చేశారు. అనంతరం ఇసుకతో చేసిన లింగాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. ఆ గ్రామంలోనే శివాలయంలోనూ, కొరిడి శివాలయంలోనూ ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.



అన్ని దేవాలయాల్లో శివనామస్మరణతో పాటు అన్నదానాలు, ప్రత్యేక అభిషేకాలతో కళకళలాడాయి.

## క్షేత్రపాలకుడు రుద్రుడికి విశేష అభిషేకం



-మహాశివరాత్రివేళ ఓంనమ:శ్శివాయ

**తిరుమల,ఫిబ్రవరి 18ప్రభాతవార్త ప్రతినిధి:**

తిరుమలకొండపై క్షేత్రపాలకుడు కొలువైన పాండవతీర్థంలో "రుద్రుడు"గా ఈశ్వరుడు ఉండటంతో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శని వారం మధ్యాహ్నం విశేషఅభిషేకాలు జరిగాయి. గోగర్భండ్యామ్ ప్రాంతం లో ఆలయ అర్చకులు,ఆలయ పేష్కార్ శ్రీహరి రుద్రుడికి అభిషేకం చేశారు. తిరుమల స్థానికులతో ఓంనమ:శ్శివాయ నామస్మరణలు మిన్నంటాయి. అనంతరం తిరుమల స్థానికులకు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## మహాశివరాత్రి పర్వదినాన



ఉదయం "భోగితేరు"పై పరమశివుడు దర్శనం

-రాత్రి నందివాహనంపై కటాక్షం

**తిరుపతి,,ఫిబ్రవరి 18ప్రభాతవార్త:**

తిరుపతిలోని కపిలేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం వార్షిక బ్రహ్మోత్స వాల్లో "భోగితేరు"జరిగింది. ఉత్స వమూర్తిసోమస్కంధమూర్తి భోగితేరుపై అధిరోహించి పురవీధుల్లో ఊరేగారు. అలాగే రాత్రి స్వామివారు అధికార నందిపై ఊరేగుతూ భక్తుల నుంచి కర్పూరహారతులు అందుకున్నారు. భక్తుల శివనామస్మరణల మధ్య వాహనసేవలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఇఓ దేవేంద్రబాబు, ఎఇఓ పార్థసారధి, ఆలయ సూపరింటెండెంట్ భూపతి, భక్తులు పాల్గొన్నారు. తెల్లవారుజామున లింగోద్భవ అభిషేకంలో టిటిడి జెఇఓ సదాభార్గవి, వీరబ్రహ్మం, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



**పుత్తూరురూరల్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణం మండల పరిధిలోని శివాలయాల్లో మహా శివరాత్రి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలో ఉదయం కామాక్షిదేవికి శ్రీ సదాశివునికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పరివార దేవతలు కూడా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని పుత్తూరు ఉపాధ్యాయ మిత్ర బృందం చే సర్వంగా సుందరంగా పలు పుష్పాలంకరణతో అలంకరించారు. అనంతరం రాత్రి మంగళవాయిద్యాలు నడుమ విద్యుత్ దీపాలతో స్వామివారిని అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ప్రత్యేక పుష్పాలతో శివలింగాన్ని ఏర్పాటుచేశారు. భక్తులను శివలింగం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొడగంటి రమేష్‌బాబు, ధర్మకర్తల మండలి తదితరులు పాల్గొన్నారు. షిరిడీ సాయిబాబా ఆలయంలో స్వామివారిని ఉత్సవ మూల విగ్రహాలకు శివుని అలంకరణతో అలంకరించారు. మండల పరిధిలోని తిరుమలకుప్పం గ్రామంలో వెలసిన ఆలయంలో సదాశివరాలయంలో కూడా అభిషేకాలు, అలంకరణ చేశారు. తొరూరు మూలకోన నాగులేరు గ్రామాల్లో వెలసిన సదాశివరాలయాల్లో కూడా ప్రత్యేక పూజలు చేశారు. నేసనూరు గ్రామంలోవెలసిన సదాశివ ఆలయంలో గ్రామ సర్పంచ్ గోవిందస్వామిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక హోమాలు పూజా కార్యక్రమాలు చేపట్టారు. వెంకయ్యగుంట, శ్రీ చలమేశ్వరస్వామి ఆలయాల్లో కూడా అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## కేవీబీ పురం మండలంలో పలు శివాలయాల్లో శివరాత్రి ఉత్సవాలు

**కేవీబీ పురం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:**

మండల ప్రజలు మహా శివరాత్రి సందర్భంగా శివుని దర్శనం కోసం శివాలయాలకు వెళ్లారు. మండలంలోని కలత్తూరు గ్రామంలో వెలసిన అంకాలపరమేశ్వరి దేవాలయంలో వెలసిన సహస్ర లింగాన్ని దర్శించుకునేందుకు పలువురు మండల ప్రజలు, భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలను కూడా పరమేశ్వరి విగ్రహాలను దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త మండలి, సర్పంచ్ సింగమాల జయరామిరెడ్డి మాట్లాడుతూ సాహస్ర లింగం చాలా పవిత్రమైనదని శివ దర్శనం తీసుకుంటే అన్ని కార్యక్రమాలు విజయవంతంగా కుటుంబానికి అనుగ్రహం ఉంటుందని ఆయన తెలిపారు. అనంతరం తీర్థ ప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు. రాష్ట్ర ముదిరాజ్ సంఘం డైరెక్టర్ తరంజిరెడ్డి సహస్ర లింగాన్ని సాయంత్రం దర్శించుకుని వైభవోపేతంగా దర్శనం చేసుకున్నారు. శ్రీ పల్లికొండేశ్వర స్వామి మాజీ డైరెక్టర్ వెంకటకృష్ణయ్య, భక్తులు పాల్గొన్నారు.

## చెరువులో పడి యువకుడు మృతి



**వరదయ్యపాళెం,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

వరదయ్యపాళెం కురింజలం చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శ్రీసిటిలోని కంపెనీలో పనిచేస్తూ సెలవు కావటంతో ప్రకాష్ (24) అనే యువకుడు గొర్రెలు కడటానికి కురింజలం చెరువుకు వెళ్ళినట్లు వివరించారు. అక్కడ కాలుజారి చెరువులో పడిపోయాడు. అయితే ఆతనికి ఈత రాదు. రక్షించే వారు లేక ఆకాల మృత్యువు పాలయ్యారు. తమకు ఉన్న ఒక్కగానొక్క కొడుకు చనిపోవటంతోతల్లిదండ్రులు శోక సముద్రంలో మునిగిపోయాడు. శివరాత్రి పర్వదినాన గ్రామానికి చెందిన అందరితోమంచిగామసలేప్రకాష్అకాల మృత్యువు పాలుకావటంతో గ్రామంలో విషాదం చోటు చేసుకుంది.

## సిద్దేశ్వరకోనలో శివరాత్రి పర్వదిన పూజలు



**వరదయ్యపాళెం,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

వరదయ్యపాళెం మండలంలోని ప్రఖ్యాతి చెందిన ఉబ్బల మడుగు సిద్దేశ్వరకోనలో వెలసిన స్వామి ఆలయంలో మహాశివరాత్రి మహోత్స వాలు శనివారం భక్తిశ్రద్దలతో నిర్వాహకులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి సేవలో లోక ఫౌండేషన్ ఏకం వైస్ చైర్మెన్ లోకేష్‌దాసాజి పాల్గొన్నారు. ఆలయంలో వెలసిన సిద్దులయ్య సేవలో వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగలకు చెందిన యువకులు పాల్గొన్నారు. ఇక్కడ మాజీ సర్పంచ్ బొప్పన తిలక్‌బాబు సారధ్యంలో వేలాది మందికి అన్నదానం జరపటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో శనివారంభారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో లోకేష్‌దాసాజితో పాటు రుద్రదాసాజి, రమేష్ దాసాజి, జి.సునిల్, జి.రామమూర్తి, జి, చంద్రశేఖర్, జి.వెంకటశ్రీనివాస్, సిఎల్ఎన్ పల్లి సర్పంచ్ దుద్దువేణు, కల్లివేటు సర్పంచ్ తిరుపాల్, తలారివెట్టు సర్పంచ్ ప్రసాద్, అటవీశాఖ డివిజన్ అధికారి దేవరాజు, ఎంపిటిసి చలపతి, నూతల పాటి హరిప్రసాద్, ఉపాధ్యాయుడు అనంద్, ప్రసాద్‌నాయుడు, పార్థసారధిరెడ్డి శరత్‌బాబు తులసీరెడ్డి, శేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

## అలరించిన భక్తి సంగీత విభావరి



**శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్స వాల్లో భాగంగా శనివారం రాత్రి ధూర్జటి కళాప్రాంగణంలో జరిగిన భక్తి సంగీత విభావరి సభికులను అలరించింది. ఇక్కడ నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో దేశంలో పేరెన్నికగన్న కళాకారులచే కార్యక్రమాల్ని రూపొందించి అమలు చేస్తున్నారు. వర్ధమాన సినిగాయకులు పృధ్వీచంద్ర, సమీరా భరద్వాల్, భార్గవపిళ్ళై చే శనివారం భక్తీ సంగీత విభావరిని ఏర్పాటు చేసారు. పృధ్వీచంద్ర ఇటీవల పలు హిట్ పాటలను అందించారు. సంగీత ప్రియులకు అత్యంత సన్నిహితులై ఆతని పాటలంటే అభిమానులు సంబర పడుతారు. ఇటీవల భీమ్లానాయక్, ఆర్ఆర్ఆర్ సినిమాల్లో హిట్ పాటలు అందించారు. శనివారం భక్తి పాటలను ఆలపించారు.

## భక్తులకు విరివిగా అన్నదానాలు,మజ్జిగపంపిణీ



**.శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

మహాశివరాత్రికి విచ్చేసిన భక్తులకు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, పలుదుకాణాల యజమానులు, లాడ్జీల నిర్వాహకులు తమ వంతు చేయూతగా వారికి మజ్జిగపంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈనేపధ్యంలో తేరువీధిలో ఉన్న మయూర లాడ్జీ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టి సుమారు వెయ్యిమందికి అన్నదానం నిర్వహించారు. కాగా కైలాస్‌గ్రాండ్ యాజమాన్యం వారిచే శివరాత్రి రోజు, రధోత్స వం, కళ్యాణోత్స వంలో అన్నదాన కార్యక్రమాలును ఉదయం, మద్యాహ్నం నిర్వహిస్తుంటారు. ఈనేపధ్యంలో కైలాస్‌గ్రాండ్ నిర్వాహకులు మద్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా అన్నిశాఖల ఆధ్వర్యంలో స్థానిక నవయుగరాజగోపురం వద్ద మజ్జిగశిబిరం ఏర్పాటుచేసి భక్తులకు మజ్జిగను పంపిణీచేశారు. సన్నిధివీధిలో యంగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

## అగస్తీశ్వరాలయంలో భక్తజన సందోహం



**తొట్టంబేడు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

మహాశివరాత్రి సందర్భంగా శనివారం మండలంలోని శివాలయాల్లో విశేషపూజలు నిర్వహించారు. ఈనేపధ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయంగా మండలంలోని పెద్దకన్నలిలోని దుర్గాదేవి సమేత అగస్తీశ్వరాలయంలో వెలసిన పరమశివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వెలసినస్వామివారికి విశేషపూజలు చేపట్టారు. ఉదయం నుంచే ఆలయంలోస్వామివారికి విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించి అలంకరణ చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయానికి వచ్చే భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటుచేశారు. అనంతరం భక్తులకు ఉచితంగా తీర్థప్రసాదాలను అందించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం స్వర్ణముఖినదీతీరాన వెలసిన అర్ధనారీశ్వరాలయంలో వెలసిన స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నసింగమాల గ్రామంలో వెలసిన వీరభద్రస్వామికి అభిషేకాలు నిర్వహించి పూజలుచేశారు. స్వామివారి నిలువెత్తువిగ్రహానికి చందనాలంకరణ చేపట్టడంతో పలువురు భక్తులు విచ్చేసి ఆయన్ను దర్శించుకున్నారు.

## భక్తులకు రుద్రాక్షల ప్రసాదం: ఎంఎల్‌ఏ



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం మహాశివ రాత్రి పర్వదినాన వాయులింగేశ్వరుని దర్శనా నికి వచ్చిన భక్తులకు స్వామివారి గర్భగుడి ప్రధాన గడప నుంచి మహాలఘుదర్శనం ఏర్పాటు చేసారు. అయితే వచ్చే అతిధులు భక్తులకు ఇబ్బంది లేకుండా చేయటానికి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి చొరవ చూపారు. గత ఏడాది కకూడా ఆయన వచ్చిన భక్తులు, అతిధులకు ఆయన పండ్లు, రుద్రాక్షాల ప్రసాదాలను అందించారు. శనివారం ఉదయం నుంచి ఎంఎల్‌ఏ మధుసూధనరెడ్డి అక్కడే తిష్టవేసి వచ్చిన వారికి రుద్రాక్షల ప్రసాదాలను అందించారు. అంతేకాక విఐపిలను పంచెధరించి వచ్చిన వారికి ఆలయంలోపల దర్శనం ఏర్పాటు చేసారు. అందరికి సుదర్శనం కల్పించాలనే మహోన్నత లక్ష్యంతో ఎంఎల్‌ఏ అక్కడ తిష్టవేసారు.

## జన జాగరణకు ప్రత్యేక ఏర్పాట్లు



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

మహాశివరాత్రి పర్వదినాన శివయ్య సన్నిధిలో నిద్ర చేస్తే మంచిదని చెబుతారు. శివరాత్రి పర్వదినాన పగలంతా స్వామి ధ్యానంలో ఉంటూ రాత్రి శివయ్య సన్నిధిలో నిద్ర చేసి వేకువ జామున బోళాశంకరుని దర్శించుకుంటే మోక్షానికి మార్గమంటారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి ఏడాది వేలాది మంది భక్తులు స్థుపద మండపంలో నిద్రించే వారు. కొంత కాలం తరువాత స్థుపద మండపం నుంచి నాల్గవ గేటు వరకు చక్కగా పందిళ్ళు వేసి భక్తులకు అవకాశం కల్పించారు. ఈ ఏడాది స్థుపదమండపం నుంచి అన్ని వ్యాపార సంస్థలు వెలసి భక్తులు నిద్రించుటకు వీల్లేకుండా చేసారు. దాంతో ఇక్కడ నిద్ర చేసే భక్తులకు ఇబ్బందిగా మారింది. ఈ సమస్యను గుర్తించిన పాలకులు శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఇఓ వికె సాగర్‌బాబులు 'జన జాగరణకు' విస్తృత ఏర్పాట్లు చేసారు. ముఖ్యంగా నాల్గవ గేటు పక్కన వేలాది మంది నిద్రించేందుకు, అలాగే బిక్షాల గాలిగోపురం పక్కన కూడా వేలాది మంది నిద్రించుటకు చక్కటి ఏర్పాట్లు చేసారు. దాంతో రాత్రియే కాకుండా పగలు మాడు పగిలే ఎండల్లో కకూడా సెద తీరటానికి ఎంతో ఉపయోగపడింది.

## అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయండి.

టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:**

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రిచించిన రాజ్యాంగాన్ని అమలు చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రోడ్ షోను అడ్డుకోవడాన్ని నిరశిస్తూ నల్లరిబ్బన్స్ నోటికి కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ క్యాక్రమంలో టిడిపి నాయకులు కోరా హరిప్రసాద్, ఢిల్లీనాథ్ రెడ్డి, రావిళ్ళ గిరి, సురేంద్ర నాయుడు, మహేష్ నాయడు, విజయ్‌కుమార్ రెడ్డి, గిరిధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వనామ్మస్మరణలతో మారుమ్రోగిన శివాలయాలు

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:**

మహాశివరాత్రి మహోత్స వాన్ని పురస్కరించుకుని శనివారం శివాలయాలు శివనామ్మస్మరణలతో మారుమ్రోగాయి. ఎంఎల్‌ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మండలంలోని శివాలయాలు దర్శించుకుని మ్రొక్కులు తీర్చుకున్నారు. వైఆర్ కండ్రిగ సమీపంలో గల శ్రీ ఊట్ల ఆగస్త్యేశ్వర స్వామికి, గంగాదేవికి, ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామిజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయలచెరువు సమీపంలో వెలసియున్న శ్రీ భవానీ జలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఉభయ గ్రామాల ప్రజలు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శ్రీ శక్తి పీఠంలో శ్రీసిద్ధేశ్వరానంద మహాభారతి స్వామి ఆధ్వర్యంలో శ్రీ రమ్యానంద భారతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతం శివపార్వతుల కళ్యాణోత్స వం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ క్రమంలో ఆలయం వద్ద నిరంతరాయంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా రాయలచెరువు పేట సమీపంలోని శ్రీశనీశ్వర స్వామి వారి ఆలయంలో ఉంగరాల సుబ్రమణ్యం శర్మ శనిత్రయోదశి పూజలు చేశారు. అనంతరం తైలాభిషేకం నిర్వహించి, శాంతి హోమం జరిపించారు.

## హర హర మహాదేవ శంభో శివశంకర



-శివనామ స్మరణతో మారుమ్రోగిన శైవ క్షేత్రాలు

**తిరుపతిరూరల్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:**

మహాశివ రాత్రిని పురస్కరించుకుని శైవ క్షేత్రాలన్ని శివనామ స్మరణతో మారుమ్రోగాయి. భక్తులు ఉదయాన్ని స్నానాలు ఆచరించి భక్తిశ్రద్దలతో శివాలయాలను సందర్శించారు. తిరుపతిరూరల్ సి.గొల్లపల్లిలో శివకోటి శివాలయంలో వెలసిన శ్రీప్రసన్న పార్వతీసమేత నీలకంఠేశ్వరస్వామి దేవస్థానములో శివరాత్రి మహోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ఈనెల 16వ తేదీ నుండి 18వ తేదీ వరకు మహా శివరాత్రి 15వ వార్షికోత్స వమును అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి 8గంటలకు శివపార్వతుల కళ్యాణోత్స వం వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్స వం అనంతరం పిల్లనగ్రోవులు, టిటిడిచే చెక్క భజనలు, కోలాటాలతో గ్రామోత్స వం నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త కె.తులసీరామిరెడ్డి తెలిపారు. రాత్రి 12గంటలకు లింగోద్భవ శుభ సమయాన బిల్వార్చన, మూలమూర్తికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిశేకం, ప్రాయశ్చిత హోమం, జయాది హోమం, మహాపూర్ణాహుతి కలశ ఉద్వాసన, ప్రోక్షణ, ఆశీర్వచనమ్, తీర్థప్రసాదాలు వితరణ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు బి.బ్రహ్మయ్య శర్మ, ఆలయ ఇన్‌చార్జి ఈశ్వరరెడ్డి, సర్పంచ్ విదుదల రవి, ఉప మండలాధ్యక్షుడు మాధవరెడ్డి, నిరంజన్‌రెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జగన్ సైకో పాలనకు చరమగీతం పాడాలి

-'నిరంకుశత్వానికి నిదర్శనం' అనపర్తిలో చంద్రబాబు సభను అడ్డుకోవడం

-టిడిపి శ్రేణుల ధర్నాలో అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి



**తిరుపతిరూరల్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:**

రాష్ట్రంలో జగన్ సైకో పాలనకు చరగీతం పాడాలని తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి పిలుపు నిచ్చారు. అనపర్తిలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సభను అడ్డుకుని, 7కిలోమీటర్లు నడిపించడం జగన్ నిరంకుశత్వానికి నిదర్శనం అన్నారు. అనపర్తి నియోజకవర్గంలో చంద్రబాబునాయుడు పర్యటనను అడుగడుగునా అడ్డుకోవటాన్ని నిరసిస్తూ శనివారం చెర్లోపల్లి క్రాస్ టిడిపి శ్రేణులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ గతంలో జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసిన సమయంలో ఏనాడైన అప్పటి టిడిపి ప్రభుత్వం ఆటంకం కలిగించిదా అని ప్రశ్నించారు. . వైకాపా నిరంకుశ పాలనకు పోలీసు వ్యవస్త కొమ్ముగాయడం దారుణమన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు రాష్ట్ర ప్రజలు తీక్షనంగా వీక్షిస్తున్నారని, తగిన సమయంలో బుద్ది చెప్పటానికి సిద్దంగా ఉన్నారని ఈశ్వరరెడ్డి అన్నారు. రాష్ట్రంలో అవినీతి, వైకాపా నాయకుల ప్రజాప్రతినిధుల అరాచకాలు ఎక్కువైనాయని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు క్రిష్ణమూర్తిరెడ్డి, అలిమినేని మధు, శ్రీధర్‌నాయుడు, బిరుదాల భాస్కర్‌రెడ్డి, కత్తి సుధాకర్, విప్పర్ల లోకేష్‌నాయుడు, ఈశ్వరయ్య, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎపిజిఇఎ తిరుపతి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



**తిరుపతిరూరల్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తిరుపతి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిరుపతి జిల్లా అధ్యక్షుడుగా వై.జె.పి. ప్రసాద్‌రెడ్డి, కార్యధర్శిగా యస్.సుబ్బరాయుడు(ఆర్ అండ్ బి), కోశాధికారిగా కె.ఎం.మధుబాబు(ట్రెజరి), ఉపాధ్యక్షులుగా నాగేశ్వర(ఐసిడిఎస్), రవికుమార్(ఇరిగేషన్), రామచంద్ర( స్టేట్ ఆడిట్), జాయింట్ సెక్రటరీలుగా అరుణ (సెరికల్చర్), మురలీకృష్ణ (విఆర్వో) మధుసూధనరావు (ఎఎస్ఓ) భార్గవ్‌రెడ్డి (కో–ఆపరేటివ్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు వైజెపి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పోరాడతానన్నారు.

## ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు

**తిరుపతి క్రీడ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త**



స్థానిక జీవకోనలోని జీవలింగేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో వెలసిన జగద్గురు శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సమేత శ్రీశ్రీశ్రీ గోవిందాంబ ఆలయం నందు శివరాత్రిని పురస్కరించుకుని ఉదయం ఆరు గంటలకు అభిషేక అలంకరణ, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం విశ్వం విద్యా సంస్థల అధినేత డా. ఎన్. విశ్వనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాచగుండ్ల చంద్రశేఖర్ విశ్వకర్మ మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందాంబ కళ్యాణం శివరాత్రి రోజున జరిగిందని పురాణాల ద్వారా తెలుస్తోంది. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 1608లో జన్మించారని భూత భవిష్యత్ వర్తమాన కాలాల గురించి ముందుగానే గ్రహించి కాలజ్ఞానం ద్వారా చెప్పడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తులసి విశ్వనాథ్ రెడ్డి, విశ్వచందన్ రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి సతీమణికి ఘన స్వాగతం

**పిచ్చాటూరు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త**

సత్యవేడు నియోజకవర్గంలోని కైలాసకోన రోడ్డు వద్ద టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలతా రెడ్డికి ఎమ్మెల్యే ఆదిమూలం ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోన ప్రసాదాలను అందించి వేద పండితులు ఆశీర్వచనాలు పలికారు. ఆయనతో పాటు జడ్పి ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్, ఎంపిపిదివాకర్‌రెడ్డి, కోన చైర్మన్ సుబ్రమణ్యం యాదవ్, అపరంజి రాజు, పల్లి కొండేశ్వర ఆలయప్రత్యేకఆహ్వానితులుబాల్రెడ్డి రాధాకృష్ణన్ రెడ్డి, కోన ఈవో కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## శివనామస్మరణతో కిక్కిరిసిన శివాలయాలు

**పిచ్చాటూరు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త**



మండలంలోని పలు శివాలయాలు శనివారం శివరాత్రి మహోత్స వ పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం నుంచి శివనామ స్మరణతో ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు చేసి శివలింగాలని వివిధ రకాల పూలతో విశేషంగా సుందరంగా అలంకరించి పలు రకాల అభిషేకాలతో పూజించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సుప్రసిద్ధ శివాలయం అయిన రామగిరి శ్రీ వాలీశ్వర స్వామి దేవాలయం, కీలపూడి జలకంఠేశ్వర స్వామి దేవాలయం, శేషంపేట నీలకంఠేశ్వర స్వామి దేవాలయం, నీరువాయిలో నీలకంఠేశ్వరాలయంలో రోజంతా భక్తులు సందడితో కనిపించాయి.

### పల్లికొండేశ్వర స్వామిని దర్శించుకున్న టిటిడి చైర్మన్ సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలత రెడ్డి

**పిచ్చాటూరు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త** మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని తిరుపతి జిల్లా నాగలాపురం మండలం సురుట పల్లిలో వెలసి ఉన్న శ్రీ పల్లికొండేశ్వర్ల స్వామి ఆలయంను టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలత రెడ్డిని సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పల్లికెండేశ్వర స్వామి ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ఏవిఎం బాలాజీ రెడ్డి రాష్ట్ర కార్యదర్శి కెవి భాస్కర్ నాయుడు నాగలాపురం మండల కన్వీనర్ అపరంజి రాజు, రైతు సంఘం అధ్యక్షులు చిన్నదొరై, జడ్పిటిసి సభ్యులు విష్ణు ప్రియ, కిరణ్ కుమార్ నాయుడు, ట్రస్ట్ బోర్డు సభ్యులు ఎస్ఎం సురేష్ వారికి సాదరంగా ఆహ్వానం పలికారు. అనంతరం వైవి సుబ్బారెడ్డి సతీమణి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

# తిరుపతి డివిజన్

## శివ నామస్మరణతో మార్మోగిన కైలాసనాధకోన శైవక్షేత్రం..!

**నారాయణవనం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :**



మండలంలోని అరణ్యకండ్రిగ పంచాయితీలోని కైలాసనాధకోనలో వెలసిన కామాక్షాంభిగా సమేత కైలాసనాధుని సన్నిధి శనివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివనామస్మరణతో మార్మోగింది. తమిళనాడు రాష్ట్రం నుంచి ఇసుకేస్తే రాలనంత భక్తులు తరలిరావడంతో సందడిగా మారింది. భక్తులకు నెల్లూరు జిల్లా మనుబోలు మండలం కొందూరు గ్రామానికి చెందిన శ్రీ గురుదత్త భగవాన్ కెయం చంద్రమౌళీస్వామి భక్తులకు అన్నదానం, మజ్జికను పంపిణీ చేశారు. భక్తులు జాగారం వున్న తర్వాత 12గంటలకు లింగోద్భవ పూజను తిలకించారు. అలాగే నారాయణవనంలో వెలసిన చంపకవల్లి సమేత పరాశరేశ్వరస్వామి ఆలయం, సముదాయంలో ఆగస్తీశ్వరస్వామి ఆలయం, తుంబూరులోని తుంబూరీశ్వరుని ఆలయంలోను మహాశివరాత్రి వేడుకలను నిర్వహించారు. అలాగే నారాయణవనంలోని చంపకవల్లీ సమేత పరాశారేశ్వరుడు, సముదాయంలో మరగదవల్లీ సమేత అగస్తీశ్వరుడు, తుంబూరులో తుంబూరీశ్వరుడు, పాలమంగళంలో పాలీశ్వరస్వామి ఆలయంలో మహాశిరాత్రి ఉత్స వాలు ఘనంగా జరిగింది. కార్యక్రమంలో జడ్పీటీసీ కె సుమన్, ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి పి సుదర్శన్‌రెడ్డి, కోన ఛైర్మన్ ఇ సుబ్రమణ్యంయాదవ్, మాజీ ఛైర్మన్ బత్తల భాస్కర్‌యాదవ్, ఇఓ ఎం కృష్ణానాయక్, ఉపసర్పంచ్ మురళి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కైలాసనాధునికి టిటిడి పట్టు వస్త్రాలు అందించిన ఎమ్మెల్యే

**నారాయణవనం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :**



మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని శనివారం ఉదయం కైలాసకోనలో వెలసిన స్వామి,అమ్మవారి సేవలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొని టిటిడి అధికారులు సరఫరా చేసిన పట్టు వస్త్రాలను అందించారు. ఆలయ ఛైర్మన్ ఇ సుబ్రమణ్యంయాడవ్, మాజీ ఛైర్మన్ బత్తల భాస్కర్‌యాదవ్, ఇఓ కృష్ణానాయక్‌లు ఆయనికి ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలోజడ్పీటీసీకెసుమన్,ఎంపిపి పిదివాకర్‌రెడ్డి, సర్పంచ్ రత్న, ఉపసర్పంచ్ మురళి పాల్గొన్నా రు.

## వైకాపా ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తుంది

**నింద్ర, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :**

రాష్ట్రంలోని వైకాపా ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తుందని చిత్తూరు పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షులు ధశరధ వాసు తీవ్రంగా విమర్శించినారు. శనివారం మండల కేంద్రంలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అనపర్తిలో పర్యటనను అడ్డుకోవడం, కార్యకర్తలపై లాఠీచార్జీ చేయాడాన్ని నిరసిస్తు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. బాబయాదవ్, విజయ్‌కుమార్, ప్రశాంత్, దేవనేషన్, జగన్, మురళీనాయుడు, కోటీశ్వరరావు, భాస్కర్, రవినాయుడు, వెంకటరత్నంనాయుడు, పరదేశి తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

**నగరి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:**



నగరి మున్సిపాలిటీ కీళపట్టు గ్రామంలో వెలసిన శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్స వం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్స వానికి మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి పాల్గొనగా ఆలయ నిర్వాహకులు పండితులు ఘన స్వాగతం పలికి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అలాగే నగరి రూరల్ మండలం బుగ్గ అగ్రహారంలో వెలసిన శ్రీ అన్నపూర్ణేశ్వర సమేత దక్షిణ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామివారిని మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి దర్శనం చేసుకున్నారు. నగరి మున్సిపాలిటీ ఈశ్వరగుడి వీధిలో శ్రీ కామాక్షి సమేత కరకంఠేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి పూజలు నిర్వహించారు.

## భక్తులతో కళకళలాడిన శైవక్షేత్రాలు



**వడమాలపేట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:**

మహాశివరాత్రి సందర్భంగా సదాశివకోనలో పాటు మండలంలోని శివాలయాలు భక్తులతో కలకలలాడాయి. శుక్రవారంసాయంత్రం నుంచి ఆలయాలు విద్యుత్ దీపాలతో ముస్తాబయ్యాయి. వేకువ జామున నుంచే భక్తులు ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు చేసి, దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. వడమాల, ఓబీఆర్ కండ్రిగ శివాలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు. సదాశివకోనకు వేలాది మంది భక్తులు తరలివెళ్లి సదాశివుని దర్శించుకున్నారు. కోనలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగ కుండా దేవాదాయశాఖ, బోర్డు కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు పలువురు ప్రసాదాలు, అన్నదానాలు చేశారు. వడమాలపేట టోల్‌ప్లాజా వద్ద కోనకు వెళ్లే, తిరిగి వచ్చే భక్తులకు బహుజన సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం, మజ్జిగ పంపిణీ చేశారు. వడమాలపేట ఎస్ఐ రామాంజనేయులు తన సిబ్బందితో సదాశివకోనకు వెళ్లి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నారు.

## అంతా శివమయం....

ఆది మధ్య అంతం లేని మహాశివుడు



**రేణిగుంట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రేణిగుంట మండలంలోని అన్ని శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. గాజులమండ్యం(మాండవ్య మహర్షి పురం)లో కొలువుదీరిన శ్రీ కామాక్షి సమేత మూలస్థానేశ్వర ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ఆలయ నిర్వాహకులు జువ్వల ధనంజయరెడ్డి సమక్షంలో శుక్రవారం ప్రవాస భారతీయులు జువ్వల జయలక్ష్మి, జువ్వల మోహనరామిరెడ్డి, స్థానిక భక్తులు మల్లవరం వాణి, మల్లవరం నరేందర్‌రెడ్డి నూతనంగా ప్రారంభించిన కల్యాణ మండపంలో మిద్దె పుష్పకుమారి, భుజగభూషణరెడ్డి దంపతులు శ్రీ పార్వతీ పరమేశ్వరుల కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. సుమారు రెండు వేల మందికి శ్రీ శివపార్వతుల కల్యాణ విందును కట్టా హరిప్రియ, మహేష్‌రెడ్డి దంపతులు ఏర్పాటు చే శారు. సాయంత్రం ఊంజల్‌సేవ, నంది వాహనంపై కన్నుల పండుగగా ఆది దంపతులు ఊరేగింపు, రాత్రి 12 గంటలకు అద్భుతంగా లింగోద్భవం జరిగింది. మండలంలోని వెదల్ల చెరువు శ్రీ ఓంకారేశ్వర జ్యోతిర్లింగ ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. రేణిగుంట గుంటకట్ట శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన శ్రీ నందీశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేణుగోపాలపురం శివాలయంలోని శ్రీ శివయ్యను భక్తులు భక్తి పూర్వకంగా సందర్శించారు. అత్తూరు పంచాయతీ అమ్మవారి పట్టెడ గ్రామంలో కొలువైన శ్రీనీల కంఠేశ్వరస్వామిఆలయంలోఎంపీపీహరిప్రసాద్‌పర్యవేక్షనలోశివరాత్రివేడుకలుఘనంగా నిర్వహించారు.

## రాష్ట్రంలో యధేచ్ఛగా రాజ్యాంగ ఉల్లంఘన

**చంద్రగిరి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:**



ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా స్వామ్యం అత్యంత ప్రమాదకర పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు దయ్యబట్టారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద శనివారం టిడిపి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీరును నిరశిస్తూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యధేచ్ఛగా రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు ధ్వజమెత్తారు. టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండూర్ ప్రవీణ్ రాయల్, నాయకులు వీరంగారి రమేష్ రెడ్డి, శ్రీహరి నాయుడు, లంకెళ్ళ లలిత, సక్కూర్ ధనంజయ రెడ్డి, శానంట్లతులసిరెడ్డి, రాజులగారివినోదరెడి సునీల్, మండలనేని లోకేష్ రాయల్, పాళ్యం మనోహర్, శంకర్, నాగరాజు, సబ్బు, ప్రభాకర్ నాయుడు, గ్యాస్ నాగాజు, నాయుడమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి మహిళలకు బిజినెస్‌మింట్ డిజైనర్ అవార్డు

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 17 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తికి చెందిన ఓ మహిళకు బిజినెస్‌మింట్ డిజైనర్ అవార్డు లభించింది. కళలు కళాకారులకు నిలయంగా ఉన్న శ్రీకాళహస్తి నిలయంగా మారింది. కలంకారిలోనూ, ఫ్యాషన్ డిజైన్‌లో ప్రతిభ కల్గిన కళాకారులున్నారు. ఇక్కడి కళాకారులకు జాతీయ స్థాయి అవార్డులు అందుకుంటున్నారు. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి పట్టణం కాసా గార్డెన్ సమీపంలోని చర్చి కాంపౌండలో నివాసముంటున్న సురేష్‌బాబు, సుజాత దంపతుల కుమార్తె దివ్య ప్రియాంక(32) బిజినెస్‌మింట్ ఇన్ ఫ్యాషన్ వారి జాతీయ మహిళా అవార్డుల ఎంపికలోజాతీయస్థాయిఎమర్జెన్సి ఫ్యాషన్‌డిజైనర్‌గా ఎంపికయ్యారు. ఆమెకు శనివారం హైదరాబాదులోని నొవాటెల్ హాల్ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో అవార్డును అందుకుంది.


**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్,విజయవాడ**

(A.P.State Consumer Disputes Redressal Commission, Vijayawada)

F.A.I.A. 88/2023 in F.A.207/2022

వారి మధ్య (Between)

ది సీనియర్ బ్రాంచ్ మేనేజర్, కెనారా బ్యాంకు, కరకంబాడీ బ్రాంచ్, రేణిగుంట ... పిటిషనర్లు/ అప్పీలుదార్లు/ అప్పోసిట్‌పార్టీ నెం.1

మరియు

1.శ్రీ ఎస్.రజియ,డి/ఓ ఎస్ మీర్‌జాన్ సాహెబ్,డి.నెం.3-115 గొల్లవీధి,అరుగొరల కండ్రిగ, మాధవమాల,రేణిగుంట మండలం, చిత్తూరుజిల్లా... రేస్పాండెంట్ నెం.1/ రేస్పాండెంట్ నెం.1 కంప్లైనంట్

**నోటీసు (NOTICE)**

పైన ఉదహరించిన F.A.I.A.88/2023 in F.A.207/2022 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, విజయవాడ నందు పెండింగ్‌గా యున్నది. సదరు ఎఫ్.ఎలో ఐ.ఎ దాఖలు చేసియున్నారు. F.A.I.A.88/2023లో తమకు నోటీసు పంపియున్నారు. కాని సదరు నోటీసు నో సబ్ పర్సన్ ఇన్ ది విలేజ్ అను ఎండార్స్మెంట్‌తో తిరిగి వచ్చిది. అందువల్లన ఈ నోటీసు వార్త డైలీ న్యూస్ పేపర్, తిరుపతి జిల్లా ఎడిషన్ ద్వారా ఈ నోటీసును ఇవ్వమని పై కమిషన్ వారు ఉత్తర్వులు జారీ చేసి యున్నారు. అందువలన F.A.I.A.88/ 2023 in F.A.207/2022 ను తేది 10-03-2023న మీ యొక్క హాజరు కోసం వాయిదా వేసియున్నారు. కావున తేది: 10.03.2023దిన మీరు కాని మీ యొక్క న్యాయవాది ద్వారా కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, విజయవాడ ఎదుట ఉదయం 10.30గం.లకు హాజరై తమరి యొక్క వాదనలు వినిపించుకోగలరు. అట్లు కాని పక్షంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, విజయవాడ (A.P.State Consumer Disputes Redressal Commission, Vijayawada) వారు మీ యొక్క గైర్హాజరీలో నిర్ణయం తీసుకోబడుతుంది అని తెలియపరచుచున్నాము.

సం/- వి.బ్రహ్మాజీ, పిటిషనర్ల/అప్పెల్లంట్ల న్యాయవాది, విజయవాడ

# కొన్ని సంస్కరణలు ఆచరణ సాధ్యం కానివి

### భక్తులకు సుదర్శనం-అధికారులకు ప్రసంశలు

(శ్రీకాళహస్తి, ప్రభాతవార్త)




శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి పర్వదినాన ఎన్నో సంస్కరణలు, ఎన్నో ఆలోచనలు,ఎన్నో పరిశీలనలతో క్యూలైన్లు రూపకల్పన చేసినా భక్తులకు తిప్పలు తప్పలేదు. ఆలయంలో స్వామి అమ్మవార్లను సుదర్శనం చేసుకున్నా మనే సంతృప్తి కన్నా బయటకు వచ్చిన తరువాత పలు బాధలు చోటు చేసుకున్నాయి.ధార్మిక కేంద్రాల్లో కొన్ని అలోచనలు అమలు జరగవు. ఇంజనీర్లు, పోలీసులు ఎన్నో ఆలోచనలు రూపకల్పన చేసి ఆచరించుటకు ప్రయత్నించినా ఆచరణ సాధ్యం కాలేదు. ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఏమో అమ్మవారి గర్భగుడి వద్ద, శాసనసభ్యుడు స్వామి గర్భగుడి వద్ద తిష్టవేశారు. కానీ క్యూలైన్లు పర్యవేక్షణ కొరవడింది.అధికారులు ఎంతో శ్రమపడి రూపకల్పన చేసిన క్యూలైన్లు ఖాళీగా ఉన్నా వాటిలోవెళ్ళలేదు. ప్రతి ఒక్కరు 'వివివిఐపిలుగా'మారారు. క్యూలైన్లలో వెళితే సత్వర దర్శనం అవకాశం ఉన్నా ప్రతిఒక్కరు గంటల తరబడి 'గురుదక్షిణామూర్తి ఆలయం ఎదురుగా కంచుగడప దాటిన తరువాత గేటు వద్ద వేలాడటం కనబడింది. 'అక్కడ సాక్షాత్తు డివైయస్‌పి విశ్వనాదంయే భక్తులను క్యూలైన్లలోలో కదలమని చెప్పటం కనబడింది. దాంతో పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది. వచ్చిన జనం అంతా ఒక్క దక్షిణ గోపురం నుంచి కన్నప్ప కొండపై నుంచి బయటకు వెళ్ళాలంటే అక్కడ క్యూలైర్లు ఏర్పాటు చేయటంతో ఎంతో ఇబ్బంది కల్గింది.బిక్షాల గోపురం, శివయ్య గోపురాలు వద్ద నుంచి ప్రవేశం కల్పించినా సరైన సమాచారం లేకపోవటంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అయితే ఎంతో అనుభవం ఉన్న ఇంజనీరింగ్ విభాగం ఎందుకు ఈ దుస్థితిని ఆలోచించలేదో అనే విమర్శలు చోటు చేసుకున్నాయి. అయినా సుదర్శనంతో ప్రసంశలందుకున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు కూడా టిక్కెట్లు కొన్నప్పటికి ప్రయోజనం లేకపోయింది.

## నేడు ఉదయం రథోత్సవం-రాత్రి తెప్పోత్సవం



శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం రథోత్సవం నిర్వహించుటకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఉదయం 11 గంటలకు రథోత్సవం ప్రారంభించాలని నిర్ణయించారు. బ్రహ్మోత్సవాలు సందర్భంగా నిర్వహించే అతి ముఖ్యమైన ఉత్సవాల్లో రథోత్సవం పట్టణంలోని నాలుగు మాడావీధులో సాగుతుంది. లక్షలాది మంది భక్తులు హాజరయ్యే ఈ ఉత్సవానికి ఆలయాధికారులు ఏర్పాట్లు 15రోజులుగా చేపట్టారు. ఈ ఉత్సవానికి వేలాదిమంది హాజరౌతారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నారదపుష్కరిణి అనే బాబూఅగ్రహారం కోనేరులో అత్యంత వైభవంగా నిర్వహించే ఉత్సవంలో తెప్పోత్సవం నిర్వహిస్తారు.




**7వ రోజు 19.02.2023 బ్రహ్మరాత్రి ఆరవ తిరునాళ్ళు-రథోత్సవం**

ఉభయదాతలు : శ్రీ గాజుల సత్యనారాయణ, శ్రీమతి గాజుల సరస్వతమ్మ, జయరామరావువీధి, శ్రీకాళహస్తి.

**రాత్రి : తెప్పోత్సవం రాత్రి 8గం.లకు**

ఉభయదాతలు :1.శ్రీ కె.రామచంద్రారెడ్డి, మాధవమాల గ్రామం 2.కీ.శే. జూలుగంటి రాజేశ్వరమ్మ జ్ఞాపకార్థ, శ్రీ జూలుగంటి సత్య నారాయణశెట్టి మరియు శ్రీమురళీ మోహన్‌గుప్తా మరియు శ్రీ చంద్రశేఖర్, శ్రీ మురళీ జ్యువలరీస్, శ్రీకాళహస్తి.

**ధూర్జటి కళాప్రాంగణంలో నేడు..19-02-2023 ఆదివారం**

సా.4గం.లకు : కె.సులోచన, సూళ్ళూరుపేట వారిచే నృత్యప్రదర్శన
సా.4.30గం.లకు : కె.సాత్విక, శ్రీకాళహస్తి వారిచే నృత్యప్రదర్శన
సా.5గం.లకు: జాహ్నవి, శ్రీకాళహస్తి వారిచే నృత్యప్రదర్శన
సా.5.30గం.లకు: పి.మంజుల మరియు వాణి, తిరుపతి వారిచే భక్తిరంజని
సా.6గం.లకు : శ్రీలక్ష్మి కూచిపూడి కళాక్షేత్రం, తెనాలి వారిచే నృత్యప్రదర్శన
రా.7గం.లకు: తిరుమల ఆర్ట్స్ అకాడమీచే నృత్యప్రదర్శన
రా.8గం.లకు : కలైమామణి, టి.ముత్తు కుమారస్వామిచే నాదస్వర విన్యాసం
రా.11గం.: రేణిగుంట,యం.శ్యాంసాయిఆధ్వర్యంలో సత్యహరిశ్చంద నాటకం
సా.4గం.లకు : జి.రసజ్ఞ, యం.సన్నిహిత శ్రీకాళహస్తి వారిచే నృత్యప్రదర్శన
సా.4.30గం.లకు : శ్రీ పి.చంద్రారావు, శ్రీకాళహస్తి వారిచే నృత్యప్రదర్శన
సా.5.30గం. :నిర్మలా నృత్యనికేతన్ నిర్మలా విశ్వేశ్వరరావు నృత్యప్రదర్శన
సా.6.30గం.లకు : సాయిహేమంత్ క్రిష్ణ, నాసికతో వేణుగానామృతం
రా.7.30గం : ప్రముఖ సినీ నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ వారి సౌజన్యంతో వర్ధమాన సినీగాయకులు పృద్వీచంద్ర, సమీదా భరద్వాజ్, భార్గవ్ పిళ్ళై వారిచే సంగీత విభావరి.
రా.9.30గం.లకు : కల్చరల్ ట్రస్టు బెంగుళూరు వారిచే మోహినీ భస్మాసుర
రా.10.30గం.లకు : వరంగల్ అప్పల రాధిక వారిచే నృత్యరూపకం
రా.11.30గం : యూట్యూబ్ ఛానల్ ప్రశాంత్ రాజ్ వారిచే నృత్యప్రదర్శన
రా.12.30గం.:ధర్మానాయుడు,ముచ్చివోలుచే శ్రీకృష్ణ రాయబార నాటకం
రా.2.30గం.లకు : విఘ్నేశ్వర నాట్యమండలి, చెంబేడు ఓ.జనార్ధన్ వారిచే బాలనాగమ్మ నాటకం శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థాన అనుబంధ ఆలయం, పెద్దకన్నలి యందు నాటక ప్రదర్శన

# ఉత్సవ వాహనాల ముందు... కనువిందు



నందీశ్వరుపై శివయ్య, కేరళ పంచవాయిద్యాలు, యువకులచే డ్రమ్ములు వాయిస్తూ నాట్యం చేస్తున్న దృశ్యం

## పరశురామేశ్వరునికి పట్టు వస్త్రాలు

(శ్రీకాళహస్తిరూరల్-ప్రభాతవార్త)



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన మహిమాన్వితుడు పరశురామేశ్వరునికి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా బియ్యపు ఆకర్షరెడ్డి పట్టువస్త్రాలను అందించారు. ఈ ఆలయానికి శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి ఏటా పట్టు వస్త్రాలను అందించే సంప్రదాయం ఉంది.ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి శాసన సభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి కుమారుడు బియ్యపు ఆకర్షరెడ్డి,పవిత్రరెడ్డిలు ఏర్పేడు మండలం వైకాపా నాయకుడు గున్నేరి కిషోర్‌రెడ్డి సారధ్యంలో పట్టువస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మెన్ నరసింహాయాదవ్, ఇఒ రామచంద్రారెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యం యాదవ్, ఆశోక్ సాయి, సంతోష్, దినేష్,కుమార్‌రెడ్డి, మునిరత్నంనాయుడు, దాము,రమణయ్య, రాజశేఖర్‌రెడ్డి మునికృష్ణారెడ్డి, మునిరత్నంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హరోంహరా.. శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



గుడుపల్లె/కుప్పంరూరల్/శాంతిపురం/వి.కోట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : మహాశివరాత్రి పండగను కుప్పం, గుడుపల్లె, శాంతిపురం మండలాల్లో ఘనంగా జరుపుకున్నారు. గుడుపల్లె మండలం మల్లప్ప కొండపై వెలసిన స్వామివారు విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కర్ణాటక, ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు జరిపారు. ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులను కుప్పం నుంచి నడిపారు. కుప్పం మండలం కంగుంది దుర్గంపై వెలసిన శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి, శ్రీ విరూపాక్షేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శాంతిపురం మండలంలో మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అబకలదొడ్డి, శాంతిపురం, బోయనపల్లి, తుమ్మిశి, జంగాలపల్లి, రాళ్లబూదు గూరు, ఎంకెపురం, శివకురుబూరు, బెళ్లకోగిల ఆలయాల్లో పూజలు, హోమాలు చేపట్టారు. అర్చకులు కాశీనాథ్‌శాస్త్రి, శ్యామ్‌శాస్త్రి, అప్పన్నస్వామి, రఘుస్వామి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భైరవవాహనంపై ఊరేగిన కాళభైరవుడు



తవణంపల్లె, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త: మండల కేంద్రం తవణంపల్లెలో ఎత్తైన కొండపై వెలసిన శ్రీకాళభైరేశ్వరస్వామి ఆలయంలో శనివారం మహాశివ రాత్రి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వెలసిన సుమారు 10 అడుగుల ఎత్తైన ఏకవాయు శివలింగానికి ఆలయ అర్చకులు సంప్రదాయం ప్రకారం ప్రత్యేక అభిషేకాలను, పూజలను నిర్వహించారు. దేవస్థానం తరపున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**భైరవ వాహనంపై ఊరేగిన కాళభైరవుడు:**

ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం స్వామివారు తనకు అత్యంత ప్రీతిపాత్రమైన భైరవ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈకార్యక్రమంలో ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాలనుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

**అరగొండలో :**

మండలంలోని అరగొండలో శ్రీస్వయంభువనేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంతో స్వామి అమ్మవార్లకు అర్చకులు ఉదయం ప్రత్యేక అభిషేకాలను, పూజలను నిర్వహించారు. దీనితో ఈఆలయాలన్ని హరహర మహదేవ శంభోశివశంకర అంటూ భక్తుల శివనామస్మరణలతో మార్మోగాయి.

## కమనీయంగా శివపార్వతుల కళ్యాణోత్సవం

పెద్దపంజాణి ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : పెద్దపంజాణి మండలంలోని ప్రజలు మహాశివరాత్రి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు.వివిధ శివాలయాలవద్ద భక్తులతో కిటకిటలాడాయి.మండలంలోని కోగిలేరు సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ జలకంఠేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రిఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. స్వామి,అమ్మవార్ల కళ్యాణోత్సవాన్ని వేధపండితుల మంత్రోచ్ఛారణల మధ్య కన్నులపండగగా న్విహించారు.స్వామివారి కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో హజరైయ్యారు. ఈ సందర్భంగా వివిద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.భక్తుల కాలక్షేపంకోసం ఆలయప్రాంగణం వద్ద హరికథ,శివకోటి ఏర్పాటు చేసారు.

## నేడు యుపిఎస్‌సి ఇంజనీరింగ్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్ష

### -యుపిఎస్‌సి పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు : ఆర్డీఓ

తిరుపతిరూరల్, ఫిబ్రవరి18 ప్రభాతవార్త: తిరుపతిలో ఆదివారం జరిగే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఇంజనీరింగ్ సర్వీసెస్-2023 ప్రిలిమ్స్ పరీక్షల నిర్వాహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తిరుపతి ఆర్డీఓ కనకనరసారెడ్డి తెలిపారు. శనివారం ఆర్డీఓ కార్యాలయంలో యుపిఎస్‌సి ప్రవేట్ సెక్రటరీ అశ్వతితో కలిసి పరీక్షా నిర్వాహణ ఏర్పాట్లపై పరీక్షల కస్టోడియన్ ఆర్డీఓ, యూపిఎస్సీ అండర్ సెక్రటరీ బికె సింగ్ కలిసి పరీక్ష ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సమీక్షలో ఆర్డీఓ మాట్లాడుతూ ఈనెల 29న జరగనున్న యుపిఎస్‌సి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వింగ్ ఏ, బి రెండు కేంద్రాలలో నిర్వహించనున్నామని, ఈ పరీక్షకు 822 మంది అభ్యర్ధులు హాజరైతారని తెలిపారు. ఈసమీక్షలో తహశీల్దార్లు దస్తగిరి,హనుమాన్ నాయక్, పరీక్షా కేంద్రాల సూపర్‌వైజర్లు ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ నారాయణమ్మ, ప్రొపెసర్ సుబ్రమణ్యం, స్పెషల్ బ్రాంచ్ ఎస్పై చంద్రశేఖర్, విద్యుత్ శాఖ ఏఇ శంకర్‌రెడ్డి, డిటి లక్ష్మీ నారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక నగరంలో శివోహం నామస్మరణలు



తిరుపతి,ఫిబ్రవరి 18ప్రభాతవార్త: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు తిరుపతి నగరం పరిసరాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం ప్రత్యేకంగా త్రయోదశి ఘడియలు, మహాశివరాత్రి కలసి రావడంతో భక్తులు ఉదయం నుంచి ఆలయాలకు పోటెత్తారు. భక్తుల చేత స్వయంగా ఆలయాల నిర్వాహకులు అభిషేకం చేయించారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని మహాశివుడి అనుగ్రహం పొందారు.ప్రధానంగా టిటిడి కపిలేశ్వరస్వామి ఆలయం, దేవేంద్ర థియేటర్ సమీపంలో జంబుకేశ్వర స్వామి ఆలయం, జీవకోనలో జీవలింగేశ్వరస్వామి ఆలయం, ఎల్‌పిసి రోడ్డులోని అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, మధురానగర్‌లోని వీరభద్ర స్వామి ఆలయం, యోగిమల్లవరంలోని పరాశరేశ్వరస్వామి ఆలయం,పరిసరాల్లోని శివాలయాలు కిటకిటలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి భక్తులకు ప్రశాంతంగా శివుడి దర్శనం కల్పించారు.

## పార్టీ కార్యాలయం పనులను వేగవంతం చేయండి

### - వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



వెంకటగిరి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త: వైసీపీ పార్టీ కార్యాలయం పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన నివాస గృహం నిర్మితమవు తున్న వైసీపీ పార్టీ కార్యాలయం పనులను ఆయన పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని ఆయన సూచించారు. జగన్మోహన్‌రెడ్డిని సీఎం చేసేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని తెలిపారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో 175 స్థానాల్లో వైసీపీ గెలవాలని తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గంలో వైసీపీకి భారీ మెజారిటీ రావాలని చెప్పారు. నియోజకవర్గంలో తాను ఇంటింటికి తిరుగుతానని తెలిపారు. తిరుపతి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైసీపీ అఖండ మెజారిటీతో గెలవాలని తెలిపారు. తన ఇంటికి సొంతిల్లు వలె పార్టీ కార్యకర్తలు ఎప్పుడైనా వచ్చి కలవచ్చునని తెలిపారు. ఆయన వెంట నెల్లూరు రీజియన్ ఆర్టీసీ మాజీ చైర్మన్ శంకర్‌రెడ్డి, డక్కిలి ఎంపీపీ రాజశేఖర్, న్యాయవాదుల సంఘం కార్యదర్శి లక్కమనేని కోటేశ్వరరావు, నాయకుడు ప్రసాద్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తలకోన సిద్ధేశ్వరుని సన్నిధిలో మంత్రి, ఎమ్మెల్యేలు



యర్రావారిపాలెం,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త: మహాశివరాత్రిని పురస్కరించుకుని తలకోనలోని సిద్దేశ్వరస్వామి వారిని రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చంద్రగిరి శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కరరెడ్డిలు దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న వారికి ఆలయ పాలక మండలి సభ్యులు అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శనం చేయించారు. వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు చెంగల రెడ్డి, జడ్పీటీసీ కరుణాకరరెడ్డి, తలకోన బోర్డు మాజీ అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, రేవతి, కార్యనిర్వహణాదికారి జయకుమార్,మండల కన్వీనర్ నాగార్జునరెడ్డి, నాయకులు కిషోర్ చౌదరి,బాలాజీ చౌదరి,రమేష్, సన్నీ, హరినాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాళభైరవునికి గణనాథుని పట్టువస్త్రసాల బహూకరణ



కాణిపాకం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త: తవణంపల్లె శ్రీకాళభైరవేశ్వర దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోతవ్సాలను పురస్కరించుకుని కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి దేవస్థానం తరపున శనివారం పట్టువస్త్రాలను సమర్పించారు. ప్రతిఏటా బ్రహ్మోత్సవాల సందర్భంగా కాణిపాకం దేవస్థానం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న విషయం విధితమే. ఈమేరకు స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు, ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, కాణిపాకం సర్పంచ్ కెఎస్.శాంతి సాగర్‌రెడ్డి, అర్చకులు తవణంపల్లె చేరుకుని స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈకార్యక్రమంలో ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి వేదపండితులు పాల్గొన్నారు.

**అర్ధగిరి ఆలయం తరపున పట్టువస్త్రసాలు సమర్పణ:**

ప్రముఖ పుణ్యక్షే త్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం నుండి శనివారం శ్రీకాళభైరవేశ్వరాలయంకు పట్టువవస్త్రాలను సమరి ్పంచారు. ఆలయంలో జరుగుతున్న శివరాత్రి ఉత్సవాల సందర్భాన్ని పురస్కరించుకుని పట్టువస్త్రాలను అందజేశారు. అర్ధగిరి ఆలయ ఈఓ ఎన్‌వి. సుబ్బారెడ్డి, ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, పాలకమండలి సభ్యులు సందీప్‌రెడ్డి, పార్ధసారధిరెడ్డి, మార్కొం దయ్య, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు



కాణిపాకం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగధాంబిగా సమేత మణికంఠేశ్వరాలయంలో శనివారం మహా శివరాత్రి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈవేడుకల్లో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డిలతో కలసి స్వామి,అమ్మవార్లకు దేవస్థానం తరపున పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువెళ్ళి సమర్పించారు. వీటిని ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లకు అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు.ఇదిలా వుండగా ఆలయ ముఖ్య అర్చకులు సోమశేఖర్ గురుకుల్ ఆధ్వర్యంలో ఆలయంలో ఉదయం స్వామి అమ్మవార్ల మూలవిరాట్‌లకు ఉదయం ఆలయ అర్చకులు సంప్రదాయం ప్రకారం శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలను, పూజలను నిర్వహించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. ఇదిలా వుండగా మహాశిరాత్రి వేడుకల్లో పాల్గొనేందుకు కాణిపాకం విచ్చేసిన ఎమ్మెల్యే బాబుకు ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, అర్చకులు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయంలో స్వామి,అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు.

## అగస్తీశ్వర స్వామి సన్నిధిలో మంత్రి పెద్దిరెడ్డి



పుంగనూరు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : పురాణ చరిత్రగల దక్షిణకాశీ ఎ.కొత్తకోట అగస్తీశ్వరస్వామిని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దర్శించుకొన్నారు. ఆలయ కమిటీ, బోయకొండల ఛేర్మన్లు రామ నారాయణరెడ్డి, మిద్దింటి శంకరనారాయణ మంత్రి పెద్దిరెడ్డికి వేదపండితులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి దర్శనభాగ్యం గావించారు. వైకాపా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శివనామంతో మారుమోగిన మొగిలి

### - స్వామి దర్శనం కోసం బారుతు తీరిన భక్తులు - పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే ఎంఎస్



బంగారుపాళ్యం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త: మహాశివరాత్రి పురస్కరించుకొని స్వయంభూ శ్రీ మొగిలీశ్వరాలయం శివనామ స్మరణతో మారుమోగింది. శనివారం మహాశివరాత్రి పర్వదినం రోజు అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొన్నారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులతో పాటు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకొని తమ మొక్కులను తీర్చుకొన్నారు. వేకువజామునే స్వామి దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబి విజయకుమార్, ఇఓ మునిరాజులు, ఇతర ఆలయ సంబ్బంది తగు ఏర్పాట్లు చేశారు. అలాగే పలమనేరు డిఎస్పీ సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో స్థానిక సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నరసింహారెడ్డి, ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డిలు తమ పోలీసు సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించారు. ఆర్టీసీ అధికారులు భక్తుల కోసం ప్రత్యేక బస్సులను చిత్తూరు, పలమనేరు, గుడియాత్తం మీదుగా నడిపారు. ఆర్‌ఎస్‌ఎస్, ఆర్యవైశ్య సంఘం, గుడియాత్తంకు చెందిన మొగిలీశ్వరా ట్రస్ట్, పరిసర గ్రామస్తులు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మహాశివరాత్రి పురస్కరించుకొని శ్రీ మొగిలీశ్వరుడికి కాణిపాకం ఆలయం తరపున పట్టు వస్త్రాలను పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు సమర్పించారు.

## రూ.15 లక్షల విలువైన 20 మోటర్ సైకిళ్ళు స్వాధీనం



చిత్తూరు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త: చిత్తూరు నగర పరిసర ప్రాంతాల్లో ఇటీవల దొంగతనానికి గురైన 20 మోటర్ సైకిళ్ళను చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకొని ఈ వాహనాల దొంగతనానికి పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వీరి నుండి పోలీసులు 15 లక్షల రూపాయల విలువైన 20 మోటర్ సైకిళ్ళను స్వాధీనం చేసుకొన్నారు. చిత్తూరు పాత జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో శనివారం నగర డిఎస్పీ శ్రీనివాసమూర్తి విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఈ నెల 15వ తేదీ ఉదయం తిరుపతికి చెందిన ఎన్.లక్ష్మీనారాయణకు చెందిన ఒక ద్విచక్రవాహనం దొంగతనంకు గురికావడంతో ఆయన వన్‌టౌన్ పోలీసులకు పిర్యాదు చేశారన్నారు. ఈ ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు మోటర్ వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని గుర్తించారన్నారు. తమిళనాడు వేలూరు జిల్లా గుడియాత్తం తాలుకా పేర్నంబట్టు ఏరికుత్తి గ్రామంకు చెందిన ప్రకాష్(30), శరవణమూర్తి(44)లను శనివారం చిత్తూరు పివికెఎన్ డిగ్రీ కళాశాల వెనుక వైపు తాళంబేడు-చిత్తూరు రహదారిలో అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఈ మేరకు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ నరసింహరాజు ఆధ్వర్యంలో ఎస్ఐలు టి.ప్రసాద్, రమేష్‌బాబలు, ఐటి కోర్‌టీమ్ రమేష్ తదితరులను డిఎస్పీ శ్రీనివాసమూర్తి ప్రత్యేకంగా అభినందించారు.

## మాజీ ఎంపీపీ మృతి పట్ల పలువురు నివాళులు



రేణిగుంట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త: రేణిగుంట మండల మాజీ అధ్యక్షుడు, సీనియర్ రాజకీయ నాయకులు, వైఎస్ఆర్ అభిమాని, రైతు నాయకుడు వైసీపీ నేత చెంగారెడ్డి అతి పవిత్రమైన శివరాత్రి పర్వదినం రోజు శివైక్యం చెందారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రైతు సమస్యల పరిష్కారం కోసం ఆయన నిరంతరం శ్రమించే వారన్నారు. చెంగారెడ్డి పార్థీవదేహాన్ని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల సంతాపం తెలిపిన వారిలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మండల వైసీపీ ఇన్‌చార్జి పవిత్రరెడ్డి, ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ సంధ్యారాణి, వైస్ ఎంపీపీ సుజాత, హై కోర్టు అడ్వకేట్ పేరూరు మునిరెడ్డి, వైసీపీ యువనేత పురుషోత్తంరెడ్డి, రేణిగుంట సర్పంచ్‌నాగేషం, గాజులమండ్యం సర్పంచ్ గంగారి రమేష్, వైసీపీ సీనియర్ నేత జువ్వల దయాకర్‌రెడ్డి, గాజులమండ్యం ఎంపీటీసీ జువ్వల ధనంజయరెడ్డి, తూకివాకంసర్పంచ్ మునిశేఖర్‌రెడ్డి, తూకివాకం ఉప సర్పంచ్ శ్రీనివాసులు, తూకివాకం ఎంపీటీసీ ఆనందరావు, తారకరామానగరు వైసీపీ ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డి (ఎంఎస్ఆర్) వైసీపీ రేణిగుంట పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, పార్టీలకతీతంగా మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు సిద్దాగుంట సుధాకర్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు, రాజకీయ, ప్రజా, అధికార ప్రతినిధులు ఉన్నారు.

## అరచేతితో 'చంద్రన్న'ను ఆపలేరు : మనోహర్



కుప్పం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రజలు తెదేపా అధినేత చంద్రబాబునాయుడుకు బ్రహ్మరథం పడుతున్న విషయం తెలుసుకుని అరచేతులతో పోలీసుల ద్వారా చంద్రన్నను ఆపలేరని చంద్రబాబు కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద తెదేపా నేతలు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలో బహిరంగసభకు బయలుదేరిన చంద్రబాబును మార్గమధ్యంలో పోలీసులు అడ్డుకోవడంతో పాటు కాన్వాయ్‌కు బస్సులు అడ్డుపెట్టడం దారుణమన్నారు. దీంతో చీకటి పడ్డా సుమారు ఏడు కి.మీ.ల మేర చంద్రబాబు నడుచుకుని వెళ్లి అనపర్తి సభలో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత గోపీనాథ్, నేతలు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, సాంబశివం, డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, శాంతారాం, మంజునాథ్, త్రిలోక్, మణి,రామచంద్ర, సంజీవరాజులునాయుడు, విభూషణ్, యశోదమ్మ, ఎల్లప్ప, రవి ఎవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.